తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
నిజం.. నిర్భయంగా
హైదరాబాద్ | మంగళవారం, ఫిబ్రవరి 24, 2026 పేజీలు 8
/aksharagalam.com
సంపుటి : 14 సంచిక : 3 వెల : 3/-

## హైదరాబాద్‌లో 'హెల్మెట్ బ్యాంక్'.. పోలీసుల వినూత్న కార్యక్రమం

- హెల్మెట్ లేని వాహనదారుల కోసం 'హెల్మెట్ బ్యాంక్'
- జరిమానాకు బదులుగా అక్కడికక్కడే హెల్మెట్ అందిస్తున్న పోలీసులు
- 24 గంటల్లో కొత్తది కొని, తీసుకున్న హెల్మెట్‌ను తిరిగివ్వాలి
- మల్కాజిగిరిలో కార్యక్రమాన్ని ప్రారంభించిన ట్రాఫిక్ పోలీసులు
- పోలీసుల చొరవపై సోషల్ మీడియాలో ప్రశంసలు



## ఝార్ఖండ్ లో కుప్పకూలిన ఎయిర్ అంబులెన్స్

- ఝార్ఖండ్‌లో కుప్పకూలిన రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్ విమానం
- రాంచీ నుంచి ఢిల్లీ వెళ్తుండగా చత్రా జిల్లాలో ఘటన
- విమానంలో పైలట్లు, రోగి సహా ఏడుగురు ప్రయాణికులు
- ప్రమాదంలో ఏడుగురూ మృతి చెందినట్లు అధికారులు వెల్లడి

మిగతా 2లో



## తన పేరుతో సంస్థల ఏర్పాటుపై స్పందించిన కేటీఆర్

- కేటీఆర్ సేవా సమితి, కేటీఆర్ సేవ పేరుతో కార్యకలాపాలు
- తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని స్పష్టీకరణ




## తిరుమలరుమల లడ్డూ వివాదం..

- ఏపీ ప్రభుత్వానికి సుప్రీంలో భారీ ఊరట
- ఏకసభ్య కమిషన్ ఏర్పాటును సవాలు చేసిన సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్ కొట్టివేత
- కమిటీ విచారణ కొనసాగించవచ్చని స్పష్టం చేసిన సుప్రీం ధర్మాసనం
- సిట్, కమిటీ దర్యాప్తులు వేర్వేరని, ఒకదానిపై ఒకటి ప్రభావం చూపవని వెల్లడి
- రిటైర్డ్ ఐఏఎస్ దినేశ్‌కుమార్ కమిటీ నివేదికకు మార్గం సుగమం

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకం ఆరోపణలకు సంబంధించిన వివాదంలో ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద ఊరట లభించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ విచారణను కొనసాగించవచ్చని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కమిషన్ నియామకాన్ని సవాలు చేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఇవాళ కీలక తీర్పు వెలువరించింది.

2లో

## పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజ్...



- ఉత్తమ పనితీరు కనబరిచే వారికి అభినందన లేఖలు పంపాలని సీఎం ఆదేశం
- రెవెన్యూ శాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి, ఫ్రెష్ లుక్ తీసుకురావాలని దిశానిర్దేశం
- ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత లేకుండా చూడాలని, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచన
- టెక్నాలజీ ఆధారిత సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ

ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం పెంచడంతో పాటు, ఉద్యోగుల్లో నూతనోత్సాహం నింపే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ఉద్యోగుల పనితీరు ఆధారంగా వారికి వెయిటేజ్ ఇవ్వాలని, ఉత్తమ పనితీరు కనబరిచే వారిని గుర్తించి ప్రభుత్వం తరఫున అభినందన లేఖలు పంపాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పనితీరును ప్రోత్సహించే ఈ నూతన విధానాన్ని ప్రకటించారు.

### రాజమండ్రి కల్తీ పాల ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష

- ఈ ఘటనలో నలుగురు మృతి, 13 మందికి పైగా అస్వస్థత
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం
- ల్యాబ్ రిపోర్టుల తర్వాత నిందితులపై కఠిన చర్యలని స్పష్టం




## కొయ్యలగూడెం మండలంలో రవాణా సమస్యకు పవన్ పరిష్కారం

- ఎర్రంపేటరాజవరం మధ్య 3 కి.మీ. డొంక రోడ్డు నిర్మాణం పూర్తి
- ఉపాధి హామీ పథకం నిధులతో మూడు నెలల్లో పూర్తి
- రైతులకు, 12,500 మంది ప్రజలకు రవాణా సౌకర్యం

2లో



## పొందూరు ఖాదీతో నారా లోకేశ్‌కు శ్రీకాకుళం నేతల సరదా కౌంటర్

- ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులకు మంత్రి లోకేశ్ ఆత్మీయ విందు
- రాజకీయాలకు దూరంగా నవ్వులు పూయించిన ఆత్మీయ సమావేశం
- నేతల వినతులపై నివేదికలు అందించి, కుటుంబసభ్యులకు చీరల బహూకరణ
- టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కుటుంబసమేతంగా హాజరు

## ప్రభుత్వ వైఫల్యమే కారణం..

- కల్తీ పాల ఘటనపై జగన్ ఫైర్
- రాజమండ్రిలో కల్తీ పాలతో నలుగురి మృతి!
- ఈ ఘటనపై మాజీ సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి
- ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- ఒకే పాల వ్యాపారి నుంచి పాలు కొన్న బాధితులు



2లో

## ఈసారి సేవ చేసే అవకాశం బీజేపీకి ఇవ్వండి..

### బెంగాలీయులకు మోడీ పిలుపు

### ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

ఈసారి బీజేపీ ప్రభుత్వానికి సేవ చేసే అవకాశం ఇవ్వాలని పశ్చిమ బెంగాల్ ప్రజలను ప్రధాని మోడీ కోరారు. ఈ మేరకు బెంగాలీయులను ఉద్దేశించి బహిరంగ లేఖ విడుదల చేశారు. రాష్ట్ర అభివృద్ధి, శాంతి భద్రతలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తూ హిందీ, బెంగాల్ భాషల్లో లేఖలు రాశారు. లేఖ ప్రారంభంలో కాళీమాతను స్తుతిస్తూ రాశారు. త్వరలోనే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూల్ విడుదలకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఈ తరుణంలో ప్రధాని మోడీ లేఖ రాయడం కీలకంగా మారింది. రాబోయే నెలల్లో రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించే అధికారం ప్రజలదేనని లేఖలో పేర్కొన్నారు. అభివృద్ధి, సంపన్నమైన రాష్ట్రంగా మార్చేందుకు ఇదొక అవకాశం అని.. ఈ అభివృద్ధి ప్రయాణంలో బెంగాలీయులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# తన పేరుతో సంస్థల ఏర్పాటుపై స్పందించిన కేటీఆర్

తన పేరుతో కొంతమంది సంస్థలను ఏర్పాటు చేసినట్లు వచ్చిన వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' పేరుతో కొన్ని సంస్థలు కార్యకలాపాలు చేపడుతుండటంపై ఆయన స్పందించారు. తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని వెల్లడించారు. అలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. తన పేరుతో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు ఎలాంటి గుర్తింపు, అనుమతి లేదనే విషయం అందరూ గుర్తించాలని అన్నారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ పరిధిలోనే చేయాలని కేటీఆర్ స్పష్టం చేశారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను నిలిపివేయాలని, తనపై అభిమానం ఉన్నవాళ్లు బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేయాలని సూచించారు.

## ఈసారి సేవ చేసే అవకాశం బీజేపీకి ఇవ్వండి

బెంగాల్ భూమి దేశానికి అనేక మంది గొప్ప వ్యక్తులను అందించిందని.. నేతాజీ సుభాష్ చంద్రబోస్, రవీంద్రనాథ్ ఠాగూర్‌లను ఉదహరించారు. బెంగాల్‌కు కీర్తిని తెచ్చిన గొప్ప వ్యక్తులను, దానికి కొత్త దిశానిర్దేశం చేయవలసిన అవసరాన్ని తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దార్శనికతను కూడా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయినా.. అనేక కేంద్ర పథకాల ప్రయోజనాలు పశ్చిమ బెంగాల్‌లోని లక్షలాది మందికి చేరాయని పేర్కొన్నారు. రైతులు, యువత, మహిళలు, పేదల కోసం ప్రారంభించిన పథకాలు సానుకూల ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. గత 11 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిందని మోడీ గుర్తుచేశారు. ఇటీవల కాలంలో రాష్ట్రం వెనుకబడి ఉందని లేఖలో రాశారు. రాజకీయ హింస, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు రాష్ట్ర పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయని ఆరోపించారు. యువత వలసలు, పెట్టుబడుల కొరత గురించి కూడా ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలంటే బీజేపీకి అవకాశం ఇవ్వాలని మోడీ కోరారు.

# తిరుమలరుమల లడ్డూ వివాదం..

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. తిరుమల నెయ్యి వ్యవహారంపై ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ సిట్ దర్యాప్తు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం సమాంతరంగా మరో కమిటీని ఎలా ఏర్పాటు చేస్తుందని సుబ్రహ్మణ్యస్వామి తన పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సీఎం చంద్రబాబు, టీటీడీ, సీబీఐని ప్రతివాదులుగా చేర్చారు. స్వామి వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం.. ఒక దర్యాప్తు సంస్థ విచారణ మరో కమిటీపై ప్రభావం చూపదని స్పష్టం చేసింది. "రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీ పరిపాలనాపరమైన లోపాలను గుర్తించేందుకు ఏర్పాటు చేయబడింది. ఇది సీబీఐ దర్యాప్తును ప్రభావితం చేస్తుందని మేము భావించడం లేదు. చట్ట ప్రకారం సిట్, ఏకసభ్య కమిటీ తమ తమ విధులను నిర్వర్తించవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. ఈ రెండు విచారణలు వేర్వేరని, ఒకదాని పరిధిలోకి మరొకటి రాదని (ఓవర్‌లాపింగ్ కాదని) తేల్చి చెప్పింది. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం నెయ్యి కొనుగోలు టెండర్లు, నిబంధనల సడలింపులో లోపాలు జరిగాయని సీబీఐ సిట్ తన నివేదికలో ప్రభుత్వానికి వెల్లడించింది. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది. ఈ సిట్ నివేదిక ఆధారంగా ఎవరిపై, ఎలాంటి చర్యలు తీసుకోవాలో సిఫార్సు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 45 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఈ కమిటీని ఆదేశించింది. తాజాగా సుప్రీంకోర్టు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దినేశ్‌కుమార్ కమిటీ తన విచారణను ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం సుగమమైంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

# పొందూరు ఖాదీతో నారా లోకేశ్ కు శ్రీకాకుళం నేతల సరదా కౌంటర్

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన ఆత్మీయ విందు, రాజకీయాలకు అతీతంగా నవ్వుల విందుగా మారింది. శ్రీకాకుళం, విజయనగరం పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యుల కోసం సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో లోకేశ్ ఈ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రోజూవారీ రాజకీయ హడావుడికి దూరంగా, పూర్తి వ్యక్తిగత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం అందరిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సమావేశంలో నేతలంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, తమ కుటుంబసభ్యులను పరస్పరం పరిచయం చేసుకున్నారు. రాజకీయ అంశాలకు తావులేకుండా ప్రేమలు, పెళ్లిళ్లు, పిల్లల బాగోగులు, ప్రాంతీయ ప్రత్యేకతల వంటి ఆసక్తికరమైన విషయాలపై ముచ్చటించుకున్నారు. శ్రీకాకుళం నేతల వెటకారం, విజయనగరం నాయకుల చతురతతో సంభాషణలు రక్తి కట్టించాయి.



# తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు..

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' (ఏపూ) పేరును ఇకపై లిలి'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'లిలిగా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని నిర్ణయించారు. దీనివల్ల వేలమంది వైద్య సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరులో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి గాను 70 ఎకరాల భారీ కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం , రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తీసుకున్న ఈ నిర్ణయాలు తక్షణమే అమలులోకి రానున్నాయి.

**తెలంగాణలో మెగా నిర్ణయాలు.. ఎవరికెంత లాభం.?**

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలతో మరోసారి సంచలనం సృష్టించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం నుంచి హైదరాబాద్ మెట్రో స్వాధీనం వరకు పలు ప్రధాన అంశాలపై కీలక ఆమోదాలు లభించాయి. ప్రమాద బీమా, క్యాష్‌లెస్ హెల్త్ స్కీమ్, హెచ్ఎండిఏ విస్తరణ, రోడ్లు‌నీటి ప్రాజెక్టులు వంటి నిర్ణయాలతో రాష్ట్ర పరిపాలనలో కొత్త దిశ కనిపిస్తోంది.

1. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం.. భద్రతకు రాష్ట్ర మంత్రి వర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశంలోనే ఆదర్శవంతమైన కొత్త పథకాలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు జరిగిన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి భద్రత, భరోసా కల్పించేందుకు రెండు కొత్త పథకాలను ప్రారంభిస్తుంది.

**మొదటిది.. ఉద్యోగుల ప్రమాద బీమా పథకం**

- దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు అందరికి, పెన్షనర్లకు ప్రమాద బీమా పథకం అమలు చేస్తుంది.
- ఉద్యోగులు ఒక్క రూపాయి ప్రీమియం కూడా చెల్లించకుండా ఈ పథకాన్ని అమలు చేస్తుంది.
- మన ప్రభుత్వం తొలిసారిగా సింగరేణిలో, ట్రాన్స్ కోలో ఉద్యోగ వర్గాలకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అక్కడ విజయవంతంగా అమలు చేసింది.
- ఇప్పుడు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు అందరికి ఈ పథకాన్ని ప్రారంభిస్తుంది.
- ఈ ప్రమాద బీమా అమలుతో ఒకవేళ ఎవరైనా ప్రమాదం లో మరణిస్తే రూ.1.2 కోట్లు ప్రమాద బీమా పరిహారం అందుతుంది.
- సహజ మరణానికి 60 ఏళ్ల వరకు ఉద్యోగులకు రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది.
- రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ కార్పొరేషన్లు. ప్రభుత్వ రంగ సంస్థల పరిధిలో 5 లక్షల 19 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులున్నారు. వీరితో పాటు 2 లక్షల 38 వేల మంది పెన్షనర్లు ఉన్నారు. మొత్తం 7.57 లక్షల మందికి ఈ ప్రమాద బీమా వర్తిస్తుంది.

**2. ఉద్యోగులకు రెండో శుభవార్త.. క్యాష్ లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్**

- దీర్ఘకాలికంగా ప్రభుత్వ ఉద్యోగుల ఎదురుచూస్తున్న మరో కోరికను రాష్ట్ర కేబినెట్ ఈ రోజు నెరవేర్చింది.
- ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు క్యాష్ లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ (జునూ) అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది.
- 3 లక్షల 56 వేల మంది ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులతో పాటు 2.88 లక్షల మంది పెన్షనర్లు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు మొత్తం 17.07 లక్షల మందికి ఈ పథకం వర్తిస్తుంది.
- ఇకపై ప్రభుత్వ ఉద్యోగులు ఆసుపత్రుల్లో ఒక్క రూపాయి చెల్లించకుండానే వైద్య చికిత్సలు అందుతాయి.
- అన్ని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 652 ఎంప్యానెల్ ప్రైవేట్ హాస్పిటల్స్ లో ఈ పథకం వర్తిస్తుంది. దీనిపై మొత్తం 1998 వైద్య చికిత్సలు అందిస్తారు.
- ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ ఎంప్లాయీ కార్డ్ అందిస్తారు.
- రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ఈ ఉచిత నాణ్యమైన వైద్యం అందించాలని కేబినెట్ నిర్ణయించింది.
- ఈ పథకానికి ప్రభుత్వ ఉద్యోగులు తమ బేసిక్ పే నుంచి 1.5 శాతం తమ వాటాగా చెల్లిస్తారు. అంతే సమాన వాటాను ప్రభుత్వం మ్యాచింగ్ వాటా చెల్లిస్తుంది.

# ప్రభుత్వ వైఫల్యమే కారణం..



రాజమండ్రిలో కల్తీ పాలు సేవించి నలుగురు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సంఘటనపై మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపిన ఆయన, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆహార భద్రత అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లిందని జగన్ ఆరోపించారు. ఈ దారుణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి విషాదాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో ఇవి పునరావృతం కాకుండా తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితులందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్య శాఖ వెంటనే రంగంలోకి దిగాలని, అవసరమైతే నిపుణులైన వైద్య బృందాలను పంపాలని జగన్ కోరారు. ఆహార భద్రత తనిఖీలను కట్టుదిట్టం చేసి, పాల వంటి నిత్యావసరాలపై ప్రజలకు నమ్మకం కలిగించాలని విజ్ఞప్తి చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి నగరంలోని లాలా చెరువు, చౌడేశ్వరి నగర్ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా నలుగురు మరణించారు. మూత్రం రాకపోవడం (అనూరియా) లక్షణాలతో వీరు మృతి చెందగా, దీనికి కల్తీ పాలే కారణమని అనుమానిస్తున్నారు. ఆదివారం రాత్రి ఎస్. శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) మరణించారు. అంతకుముందు మరో ఇద్దరు చనిపోయారు. ఈ నెల 15 నుంచి సుమారు 14 మంది అనారోగ్యంతో వివిధ ఆసుపత్రుల్లో చేరారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. బాధితులంతా ఒకే పాల వ్యాపారి వద్ద పాలు కొనుగోలు చేయడంతో కల్తీ జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# కొయ్యలగూడెం మండలంలో రవాణా సమస్యకు పవన్ పరిష్కారం

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ఏలూరు జిల్లా, కొయ్యలగూడెం మండలంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రవాణా సమస్యకు పరిష్కారం లభించింది. ఆయన ప్రత్యేక చొరవతో ఎర్రంపేటరాజవరం గ్రామాల మధ్య 3 కిలోమీటర్ల డొంక రోడ్డు నిర్మాణం కేవలం మూడు నెలల్లోనే పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. గతంలో ఈ దారి బురదమయంగా ఉండి, ప్రయాణానికి తీవ్ర ఇబ్బందికరంగా ఉండేది. స్థానికులు, రైతులు పడుతున్న కష్టాలను తెలుసుకున్న పవన్ కల్యాణ్, ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నుంచి రూ.60 లక్షల నిధులు మంజూరు చేయించి పనులను వేగవంతం చేశారు. ఈ రోడ్డు నిర్మాణంతో దాదాపు 12,500 మంది ప్రజలకు రవాణా కష్టాలు తీరాయి. ముఖ్యంగా రైతులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా మారింది.

## ఝార్ఖండ్ లో కుప్పకూలిన ఎయిర్ అంబులెన్స్

ఝార్ఖండ్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఏడుగురు ప్రయాణికులతో రాంచీ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ అంబులెన్స్ చత్రా జిల్లాలో కుప్పకూలింది. ఈ ఘటనలో విమానంలో ఉన్న ఏడుగురూ మరణించినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్‌కు చెందిన బీచ్‌క్రాఫ్ట్ జ90 ఎయిర్ అంబులెన్స్ నిన్న రాత్రి 7:11 గంటలకు రాంచీ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయింది. తీవ్ర గాయాలపాలైన సంజయ్ కుమార్ అనే రోగికి మెరుగైన చికిత్స అందించేందుకు ఢిల్లీకి తరలిస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. టేకాఫ్ అయిన సుమారు 20 నిమిషాల తర్వాత, వాతావరణం అనుకూలంగా లేనందున మార్గాన్ని మళ్లించాలని పైలట్ కోరినట్లు, ఆ తర్వాత విమానంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న ఇద్దరు పైలట్లు, రోగి, ఒక డాక్టర్, పారామెడిక్, ఇద్దరు సహాయకులు సహా మొత్తం ఏడుగురూ మరణించినట్లు చత్రా డిప్యూటీ కమిషనర్ కీర్తిశ్రీ జి వెల్లడించారు. అయితే, మృతుల సంఖ్యపై భిన్నమైన కథనాలు వెలువడుతున్నాయి. ఈ ఘటనలో ఒకరు మాత్రమే మరణించి, ఆరుగురు ప్రాణాలతో బయటపడ్డారని కొన్ని నివేదికలు పేర్కొంటుండటంతో కాస్త గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా యంత్రాంగం, సహాయక బృందాలు చత్రా జిల్లాలోని సిమారియా అటవీ ప్రాంతంలోని ప్రమాద స్థలానికి చేరుకున్నాయి.

# పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజ్...

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో ప్రజల మన్ననలు పొందుతూ, అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బందిని గుర్తించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. పనితీరు సరిగా లేని వారిని గుర్తించి ప్రేరణ కల్పించడంతో పాటు, బాగా పనిచేస్తున్న వారిని ప్రశంసించడం ద్వారా ఉద్యోగుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరుగుతుందని ఉన్నతాధికారులు సైతం ఏకీభవించారు. "ప్రతి నెలా ఉత్తమ పనితీరు కనబరిచే ఉద్యోగులను గుర్తించి, వారికి అభినందన లేఖలు పంపాలి. ఈ ప్రశంసలను వారి సర్వీస్ రికార్డులలో కూడా నమోదు చేయాలి. ఇది వారి కెరీర్‌కు దోహదపడుతుంది," అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ విధానం ప్రభుత్వ ఉద్యోగులను అభినందించడంలో ఒక కొత్త అధ్యాయమని, దీని ద్వారా పాలనలో మరింత సానుకూల మార్పు వస్తుందని అధికారులు పేర్కొన్నారు. వైద్యారోగ్యం, దేవదాయ శాఖల పనితీరుపై సమీక్షిస్తూ సీఎం పలు కీలక సూచనలు చేశారు. "ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాసుపత్రుల వరకు అన్ని స్థాయిల్లో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను బాధ్యులను చేయండి. పారిశుద్ధ్యం, వైద్య పరికరాల నిర్వహణపై ఆసుపత్రుల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు పూర్తి బాధ్యత అప్పగించాలి. ఏ ఆస్పత్రిలోనూ వైద్యుల కొరత ఉండకూడదు. అవసరమైన చోట తక్షణం నియామకాలు చేపట్టేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోండి" అని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే, దేవాలయాల్లో భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలని, ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చూడాలని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "రెవెన్యూ శాఖకు ఉన్న చెడ్డపేరు పోవాలి. గతంతో పోల్చుకుంటే స్పష్టమైన మార్పు కనిపించాలి.

## రాజమండ్రి కల్తీ పాల ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష

రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి నలుగురు మృతి చెందడం, మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. రాజమండ్రిలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్, లాలాచెరువు ప్రాంతాల్లో కల్తీ పాలు సేవించడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇప్పటివరకు నలుగురు మరణించగా, 13 మందికి పైగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో చాలామంది కిడ్నీలు పూర్తిగా పనిచేయకపోవడంతో (అనూరియా) బాధపడుతున్నట్లు వైద్యులు ప్రాథమికంగా గుర్తించారు.

# అలివేలుమంగ సమేత వేంకటగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

## ఐదు రోజుల పాటు ఉత్సవాలు
## ఆమనగల్లులోని ఆలయంలో ఏర్పాట్లు



ఆమనగల్లు, ఫిబ్రవరి 23 (అక్షర గళం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఆమనగల్లులోని అలివేలుమంగ సమేత వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏటా పాల్గుణ పాల్గు శుద్ధ షష్టి మొదలు. ఏకాదశి వరకు ఉత్సవాలను నిర్వహిస్తారు. సమీప ప్రాంతాల నుంచే కాక చుట్టుపక్కల జిల్లాల భక్తులూ పెద్దసంఖ్యలో హాజరవుతారు. 23 నుంచి 27వ తేదీ వరకు కొనసాగే ఆలయ 128వ బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

**ఆపద మొక్కుల దైవంగా..**

ఆమనగల్లులో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారికి సమీపంలో గుట్టపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయం నిత్యపూజలతో బాసిల్లుతోంది. ఆపదమొక్కుల స్వామిగా ఇక్కడి దేవుడు ప్రతీతి. ప్రతి శనివారం ప్రత్యేక పూజలు, మండపంలో వివాహాలు, సత్యనారాయాణ స్వామి వ్రతాలు జరుగుతాయి. వందలేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని ధర్మకర్త దివంగత గూడ వెంకటాచార్యులు భక్తులు, దాతల సహకారంతో అభివృద్ధి చేశారు. ఆలయ రాజగోపురం పట్టణానికే తలమాణికంగా నిలుస్తోంది. వెంకటాచార్యుల కుమారుడు, ప్రధానార్చకుడు కృష్ణమాచార్యులు ఆలయాన్ని పునరుద్ధరించారు. శిల్పకళతో నిర్మాణాలు చేపట్టారు. భక్తులకు వసతులు సమకూర్చారు. కాగా బుధవారం రోజున విశ్వక్ సేన ఆరాధన, పున్యాహవచనం, అంకురార్పణ, 24న నిత్యారాధన, మహాభిషేకం, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, 25న ఉదయం 11గంటలకు వేంకటేశ్వరస్వామి అలివేలు మంగల కల్యాణం, 26న రథోత్సవం, 27న చక్రతీర్థం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు వివరించారు.

# వార్డుల్లో ఎలాంటి సమస్యలున్నా పరిష్కరిస్తా

## ::: ఛైర్మెన్ పత్యనాయక్



ఆమనగల్లు, ఫిబ్రవరి 23 (అక్షర గళం): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో ఎలాంటి సమస్యలున్నా పరిష్కరిస్తానని మున్సిపల్ ఛైర్మెన్ పత్యనాయక్ అన్నారు. సోమవారం 6 వార్డులో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. వార్డులోని ఆయా కాలనీలలో తిరిగి సమస్యలను తెలుసుకుని మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. వార్డులో పారిశుద్ధ్య పనులు లోపించరాదన్నారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ, వీధి దీపాలు సమస్యలు ఎక్కడ ఉన్న తర్వగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని తెలిపారు. ఆయన వెంట మాజీ వార్డు సభ్యులు పూసల సత్యం, దేరంగుల వెంకటేష్, మోహన్, శ్రీధర్, రాజేందర్, యాదగిరి, మున్సిపల్ సెక్రటరీ రమేష్ తదితరులు ఉన్నారు.

**పరామర్శ**

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పెంట తండాకు చెందిన ఇస్లావత్ శంకర్ హైద్రాబాద్ డిఫెన్స్ సివిల్ ఇంజనీర్ గా ఉద్యోగం చేస్తు ఆదివారం అనారోగ్యానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ సోమవారం మృతుడి ఇంటికి చేరుకొని పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. ఆయన 10వ కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి నాయకులు శంకర్, సొమ్లా, పంతు నాయక్ తదితరులు ఉన్నారు.

# స్వయం కృషితో యువత రాణించాలి

## ::: డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా



ఆమనగల్లు, ఫిబ్రవరి 23 (అక్షర గళం): యువతీ యువకులు స్వయంకృషితో ఉన్నత శిఖ రాలకు చేరుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. సోమవారం కడ్తాల్ పట్టణంలో సురేష్, సతీష్ లు ఏర్పాటు చేసుకున్న మొబైల్ షాప్, పూజ స్టోర్ ఫ్లవర్ దుకాణాలను ఆయన చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుకున్న యువత డ్రగ్స్, మత్తు పానీయాలకు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. యువత ఒకరిపై ఆధారపడకుండా స్వయంకృషితో ఎదిగినప్పుడే దేశం అభివృద్ధిలో పయనిస్తుందని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు రాలేదని నిరాశ చెందకుండా తమలో ఉన్న ప్రతిభను వెలికి తీసి స్వయంకృషితో ఎదగాలని అన్నారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ముత్తు కృష్ణ, కొప్పు కృష్ణ, సురేష్, అంజి, శ్రీకాంత్, యూత్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు వి వీరేందర్ గుప్తా, ఒగ్గు మహేష్ జగదీష్, శ్రీకాంత్, రేణు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత రైతులను ఆదుకోవాలి



రైతులతో కలిసి ఆర్డీవో కు వినతిపత్రం అందిస్తున్న లక్ష్మీ నర్సింహ్మారెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 23 (అక్షర గళం): రైతుల పొలాల గుండా 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు, తీగలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం, పలు గ్రామాల మీదుగా 765 కేవీ బీదర్ – మహేశ్వరం నూతన విద్యుత్ లైన్ ఏర్పాటుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. హైటెన్షన్ విద్యుత్ తీగల ఏర్పాటుతో నష్టపోతున్న రైతులకు న్యాయం చేయాలని సోమవారం రైతులతో కలిసి కందుకూరు రెవెన్యూ డివిజినల్ అధికారి జగదీశ్వర్ రెడ్డికి కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటుతో వ్యవసాయ భూముల వినియోగాన్ని ప్రభావితం చేస్తుందని, పంట ఉత్పత్తిపై కూడా ప్రభావం చూపుతుందని అన్నారు. కడ్తాల్ గ్రామం శరవేగంగా అభివృద్ధి చెందుతుందడంతో గ్రామానికి సమీపాన విద్యుత్ లైన్ ఏర్పాటుతో అభివృద్ధి ఆగిపోతుందని తెలిపారు. ఈ మేరకు రైతులకు న్యాయం చేసే విధంగా పై అధికారులకు నివేదిస్తానని ఆర్డీఓ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటుతో రైతులు తమ పొలాలను వ్యవసాయానికి వినియోగించుకోకపోగా, క్రయవిక్రయాలకు కూడా వీలు లేకుండా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హై టెన్షన్ స్తంభాలు మరియు విద్యుత్ తీగల ఏర్పాటుతో నష్టపోతున్న రైతులకు న్యాయం జరిగేంతవరకు రైతుల పక్షాన పోరాడతామని, రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, వార్డు సభ్యులు ఎర్రోళ్ల రాఘవేందర్,బీసీ సంఘం కడ్తాల్ అధ్యక్షుడు పిప్పల్ల వెంకటేష్, గుదే రాములు యాదవ్, గూడూరు శేఖర్ రెడ్డి, గూడూరు పెంటారెడ్డి, క్యాతిక కేశవులు, కందికంటి శ్రీరాములు, గుదే పర్వత్ కుమార్ యాదవ్, గోరేటి శ్రీశైలం, గోరేటి చంద్రశేఖర్, జంగయ్య, యాదయ్య, కేశవులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ చేసిన మున్సిపల్ ఛైర్మెన్ బృంగి రత్నమాల





కల్వకుర్తి ఫిబ్రవరి 24 (అక్షర గళం ) కల్వకుర్తి పట్టణం సుభాష్ నగర్ కాలనీ లో సోమవారం మధ్యాహ్నం 7వ వార్డులో పంబల బాలరాజు స్వామి కి మంజూరైన నూతన ఇందిరమ్మ ఇల్లుకు మున్సిపల్ చైర్మెన్ బృంగి రత్న మాల భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు స్థానిక శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారం తో ఇల్లు లేని నిరుపేదలకు అందరికీ ఇండ్లు మంజూరయ్యే విధంగా కృషి చేస్తనని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏ.ఇ కవిత వార్డు అధికారి నాగేంద్ర కాలనీ వాసులు రావుల చెన్నకేశవులు. మాజీ కౌన్సిలర్ గోరటి శ్రీను. సామ బంగారయ్య. రావుల శ్రీనివాసులు పంబళ్ల కుమార్. అంజన్ కుమార్. బాల్ రాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# హలీం దునియా..

ఆమనగల్లు, ఫిబ్రవరి 23 (అక్షర గళం): రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ప్రారంభమైన సందర్భంలో రోజంతా ఉపవాసం ఉండే ముస్లింలు సాయంత్రం దీక్ష విరమించాక బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం ఆనవాయితీ. ఇందులో హలీం, హరీస్ ప్రముఖంగా నిలుస్తుండగా వీటిని అన్నివర్గాల ప్రజలూ ఇష్టంగా స్వీకరిస్తారు. అందుకే రంజాన్ మాసంలో హలీం ఘుమఘుమలు వెదజల్లుతుంటాయి. ఆమనగల్లు పట్టణ కేంద్రంలో హలీం, హరీస్ సెంటర్లే కాకుండా మటన్ బిర్యానీ, చికెన్ బిర్యాని, రోటీ, చికెన్ కర్రీ, డబుల్ కా మీఠా, దయ్ వడ వంటకాలతో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈ మేరకు సాయంత్రం కాగానే హలీం ప్రియులు ఆయా సెంటర్ల వద్ద బారులు దిరుతున్నారు.



## మృతుల కుటుంబాలకు పరామర్శ

ఆమనగల్లు, ఫిబ్రవరి 23 (అక్షర గళం): ఆమనగల్లు పట్టణ పరిధిలోని విఠయిపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మీ లక్ష్మణ్ నాయక్ కుమారుడు శంకర్ నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము సోమవారం మృతుడి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరమార్శించారు. అదేవిధంగా ఆమనగల్లు పట్టణ కేంద్రానికి చెందిన కండె లింగయ్య, 11వ వార్డుకు చెందిన శివ కుమారుడు భాను (11), అవురుపల్లి గ్రామంలో పోలే ఎల్లయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. వారి చిత్రపటాలకు పూలమాలవేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. అధైర్య పడొద్దు అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఆయన వెంట నాయకులు మంచుకొండ జగదీష్, మాజీ సర్పంచ్ సాలయ్య, జాటావత్ శంకర్ నాయక్, నర్సింహా, శేఖర్, మల్లేష్, చంద్రు నాయక్, జంగా చారి, ప్రశాంత్, గోపి నాయక్, మల్లేష్, కిషోర్ నాయక్ తదితరులు ఉన్నారు.



## స్వచ్ఛమైన తాగునీటిని అందించమే లక్ష్యం
## ::: కౌన్సిలర్ ఎనుమల రమేష్

ఆమనగల్లు, ఫిబ్రవరి 23 (అక్షర గళం): మిషన్ భగీరథ పథకం ద్వార ప్రతి ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యమని 8వ వార్డు కౌన్సిలర్ ఎనుమల రమేష్ అన్నారు. సోమవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు బీసీ కాలనీలో ఇంటింటికి మిషన్ భగీరథ పైపులైన్ పనులను ప్రారంభించారు. ఇంటింటికీ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలనే తన ధ్యేయమని తెలిపారు. నీటి సరఫరాలో పైపులైన్ల లీకేజీలు లేకుండా ఎప్పకప్పుడు అధికారులు పరిశీలిస్తూ మరమ్మతులు చేపట్టాలని, నీటిని ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలని సూచించారు. ఆయన వెంట మద్దూరి రమేష్, వెంకటేష్, తిరుపతి, సైదులు, విజయ్, నర్సింహా, గణేష్, శీను తదితరులు ఉన్నారు.



## నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 23 (అక్షర గళం): నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర జాతరలో పసికందును చంపిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని రజక సంఘం రాష్ట్ర నాయకులు విష్ణుమూర్తి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముదిగొండ అజయ్ డిమాండ్ చేశారు. సోమవారం వారు కుమ్మెరలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కుమ్మెర జాతరలో దైవ దర్శనానికి గణేష్ కుటుంబం సభ్యులు వెళ్లగా దర్శనానికి రూ. 100 లు చెల్లించాలని నిర్వాహకులు చెప్పడంతో దీనికి రశీదు ఇస్తారా అడిగితే నిర్వహకులు ఆగ్రహంతో గణేష్ ను ఇష్టానుసారంగా చితకబాదడం దారుణమన్నారు. అతని భార్య గమనించి తన భర్తను కొట్టొద్దని వేడుకున్నా క్రూరంగా దాడి చేయడమే కాకుండా తల్లి ఒడిలో ఉన్న రెండు నెలల పసికందు అని చూడకుండా కాలితో తన్ని చంపడం సిగ్గు చేటన్నారు. పోలీసులు పారదర్శంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మల్లేష్, శ్రీను, కౌన్సిలర్ నాగిళ్ళ జగన్ తదితరులు ఉన్నారు.

# ఆర్జీకెలో కబ్జాకు గురైనా ప్లాట్లను వెంటనే పేద ప్రజలకు కేటాయించాలి

## ::: సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం

అక్షర గళం, కుత్బుల్లాపూర్ : రాజీవ్ గృహ కల్ప కబ్జాకు గురైనా యాభై ప్లాట్లను వెంటనే పేద ప్రజలకు కేటాయించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం డిమాండ్ చేశారు. బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ రాజీవ్ గృహ కల్ప జరుతున్న అవినీతి పై మేడ్చల్ –మల్కాజ్గిరి జిల్లాలో ప్రజావాణి సమస్య పరిస్కారం చేయాలనీ సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం, సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ రాజీవ్ గృహ కల్పలో దాదాపు యాభై ప్లాట్లు ఖాళీగా వున్నాయి అని వారు గుర్తు చేశారు. వాటిని స్థానికంగా కొంత మంది కబ్జా చేశారు అని , ప్రస్తుత సమాజంలో కబ్జాదారులు వేటిని వదలకుండా ప్రతిదీ కబ్జా చేస్తున్నారన్నారు. రాజీవ్ గృహ కల్ప ప్రక్కన వున్న స్థలంలో స్థానిక ప్రజలు స్మశానవాటికగా ఉపయోగించే వారు కనుక అటి స్మశాన వాటికను గుర్తించి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బక్క మల్లేష్, పొన్నకంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.







## మంజీరా రోడ్డు పైన కల్వర్టు నిర్మించాలని ప్రజావాణిలో ఫిర్యాదు

అక్షర గళం, శేరిలింగంపల్లి : మంజీరా రోడ్డు పైన కల్వర్టు నిర్మించాలని మదీనాగూడ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు మిద్దెల మల్లారెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదీనాగూడ డివిజన్ లో మంజీరా రోడ్డు పైన కల్వర్టు నిర్మించాలని గత రెండు నెలల నుండి జిహెచ్ఎంసి ప్రజావాణిలో అధికారులకు మొరపెట్టుకుంటున్న ఇంతవరకు ఎలాంటి చర్య తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నిత్యం దాదాపు 50 వేల మంది తిరిగే మంజీరా రోడ్డు ఈ మధ్యనే రోడ్డు మొత్తం చక్కగా సిసి రోడ్డం వేయడం జరుగుతుంది కానీ ముందు డ్రైనేజీని తవ్వి వదిలేశారు కావున వెంటనే ఇట్టి డ్రైనేజీ మర మత్తులను చేసి ప్రజలకు అంకితం చేయాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించి మదీనాగూడ డివిజన్ అభివృద్ధి పరచాలన్నారు.

## అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ



వెల్దండ ఫిబ్రవరి 23 (అక్షర గళం)వెల్దండ మండలంలోని బొల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చల్లపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని చెర్కూర్ సెక్టార్ పర్యవేక్షకురాలు సరితా రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె అంగన్వాడీ కేంద్రం లోని ప్రీ స్కూల్ పిల్లలు, గర్భిణి స్త్రీలు లబ్ధిదారులతో అంగన్వాడీ కేంద్రంలో ప్రభుత్వం ద్వారా అందుతున్న సదుపాయాలని అంగన్వాడీ టీచర్ మాత ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రీస్కూల్ పిల్లలకు యాక్టివిటీస్ చేయించారు.ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం మరియు న్యూట్రిషన్ ఫుడ్ ను లబ్ధిదారులు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. పిల్లలకు బాలామృతం పంపిణీ చేసి, ఎత్తు, బరువులను పరిశీలించారు

# రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని కలిసిన మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్

ఫిబ్రవరి (23) అక్షర గళం : కల్వకుర్తి మున్సిపల్ చైర్మెన్ గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం సాయంత్రం మున్సిపల్ చైర్ చైర్మెన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ వైస్ చైర్మెన్ శానావాజ్ ఖాన్. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఎనుముల తిరుపతి రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి మున్సిపల్ అభివృద్ధికి అన్ని విధాలుగా శాయ శక్తుల నా సహాయ సహకారాలు అందించి కల్వకుర్తి పట్టణ అభివృద్ధికి తోడ్పాటు నందిస్తానని అన్నారు. అనంతరం చైర్మెన్, వైస్ చైర్మెన్ ను తిరుపతి రెడ్డి శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## దోషులను తక్షణమే అరెస్టు చేయాలి : జేఏసి చైర్మన్ సదానందం గౌడ్




ఫిబ్రవరి 23 (అక్షర గళం) నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర మల్లన్న జాతర లో అగ్రకుల అహంకారం బుసలుకొట్టి అభం శుభం తెలువని పసిపాప ప్రాణం తీసిన అమానవీయ సంఘటనను సభ్య సమాజం తీవ్రంగా ఖండించాలని కల్వకుర్తి జేఏసి చైర్మన్ సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. దర్శన కోసం గుడికి వెళ్తే దర్శనం చేసుకోని యకుండా అడ్డుకొని బెదిరించి అసలు మీరు ఈ గుడి ప్రాంగణం లోకే రాకూడ దని వాళ్లని అసహ్యంగా మాట్లాడడం జరిగిందన్నారు. శ్రీనివాస్ రెడ్డి మరియు గ్రామ సర్పంచ్ తుకారం రెడ్డి తదితరులు కలిసి ఆ కుటుంబాన్ని ఒక రూములో బంధించి ఆటవికంగా దారుణంగా కొట్టడం జరిగింది. అయ్యా ఆపండి మా మీద ఎందుకు అంత కక్ష, కనీసం నా కూతురు ఆ పసి బిడ్డను చూసి మమ్మల్ని వదిలేయండి అని ప్రాధేయపడ్డారు. అయినా కూడా ఆ దుర్మార్గుడు వదలకుండా, ఆ పసికందును తన్నడం జరిగింది. పాపం ఆ చిన్నారిని హాస్పిటల్ తీసుకెళ్తే చనిపోవడం జరిగింది, ఈ సంఘటన జరిగి మూడు రోజులు అవుతున్న పోలీసుల నిర్లక్ష్య ధోరణి తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. అగ్రకుల అహంకారంతో పసి పాపను పొట్టన పెట్టుకున్న ఆ దుర్మార్గున్నికి ఖచ్చితంగా శిక్ష పడాలని కల్వకుర్తి జేఏసి చైర్మన్ సదానందం గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణం అద్దెకు దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి ఫిబ్రవరి 23 (అక్షర గళం) కల్వకుర్తి బస్టాండ్ ఎదురుగా నిర్మించిన ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయాలను అద్దెకు ఇవ్వనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సి, బీసీ నిరుద్యోగ యువకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాలు ఎస్సీ. బీసీ నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో విగ్నేష్ టైలర్ షాపు దగ్ధం



కల్వకుర్తి ఫిబ్రవరి 23 (అక్షరగళం) : కల్వకుర్తి పట్టణంలో సోమవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా విగ్నేష్ టైలర్ షాప్ పూర్తిగా కాలిపోవడం జరిగింది. నిత్యం బట్టలు కుట్టుకుని జీవనం సాగించే టైలర్ షాప్ పూర్తి గా కాలిపోవడంతో ఆ కుటుంబం రోజున పడ్డది. ప్రభుత్వ అధికారులు ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకొని వారికి న్యాయం చేయాలని కల్వకుర్తి సిపిఐ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పులిజాల పరశు రాములు డిమాండ్ చేశారు.

# నేడు జైలు సిబ్బందికి వేతన ప్యాకేజీ మేళా



అక్షర గళం, హైదరాబాద్ : ఈ నెల 24న తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కారెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ లో ఉదయం 11:00 గంటలకు జైలు సిబ్బందికి వేతన ప్యాకేజీ మేళా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ జైళ్ల , సవరణ సేవల శాఖ ఆధ్వర్యంలో జైలు సిబ్బందికి ప్రత్యేకంగా వేతన ప్యాకేజీ మేళా నిర్వహించనున్నట్లు. ఈ కార్యక్రమం ద్వారా జైలు సిబ్బందికి ప్రముఖ బ్యాంకులు అందిస్తున్న ప్రత్యేక వేతన ప్యాకేజీలు, మెరుగైన బీమా సదుపాయాలు, ఆరోగ్య పరీక్షలు తదితర ఆర్థిక ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. సౌమ్య మిశ్రా, , డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ & కారెక్షనల్ సర్వీసెస్ హాజరుకానున్నారు.ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఎన్. మురళీ బాబు, హైదరాబాద్ రేంజ్ డీఐజీ ఆఫ్ ప్రిజన్స్ డా. డి. శ్రీనివాస్ , వరంగల్ రేంజ్ డీఐజీ ఆఫ్ ప్రిజన్స్ ఎం. సంపత్, పాల్గొంటారని తెలిపారు. ఈ మేళాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమం అనంతరం భోజన ఏర్పాట్లు ఉంటాయని అధికారులు తెలిపారు. పూర్తి వివరాలకు కంట్రోల్ రూమ్, జైల్ భవన్9885513700 కు సంప్రదించాలన్నారు.

## ఆమనగల్లు ప్రజానీకానికి పాపిశెట్టి రాము ధన్యవాదాలు



ఆమనగల్లు, ఫిబ్రవరి 23 (అక్షర గళం): బీఆర్ఎస్ పార్టీపై నమ్మకంతో 8మంది కౌన్సిలర్ లను గెలిపించిన ఆమనగల్లు ప్రజానీకానికి ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని అన్నారు. ఆమనగల్లులో అధికారపక్షం బీజేపీ, కాంగ్రెస్ చేసే తప్పులను గుర్తించి ఎప్పటికప్పుడు నిలదీయాలన్నారు. ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మీద ఉన్న నమ్మకంతో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా విశ్వాసాన్ని చూరగొనాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే వరకు వదిలిపెట్టొద్దన్నారు. అధికార పార్టీ ప్రలోభాలకు తలొగ్గకుండా బీఆర్ఎస్‌ను ఆదరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.



## దానధర్మాలకు ప్రతీక రంజాన్: సయ్యద్ ఖలీల్

ఆమనగల్లు, ఫిబ్రవరి 23 (అక్షర గళం): రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాన ధర్మాలకు, స్నేహానికి ప్రతీక అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్ కొనియాడారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణ కేంద్రంలో సయ్యద్ ఖలీల్ అధ్వర్యంలో మైనారిటీ లకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. రంజాన్ మాసాన్ని ముస్లింలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మహబూబ్, షరీఫ్, బాబా, అబ్బు , హనీఫ్, ఖలీమ్, నాజర్, సలీం తదితరులు ఉన్నారు.



## కల్వకుర్తి పట్టణ అభివృద్ధికి సహకరిస్తా

### ::: ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కల్వకుర్తి ఫిబ్రవరి 24 (అక్షర గళం) కల్వకుర్తి పట్టణం అభివృద్ధి కి అన్ని విధాలుగా సహక రిస్తానని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కల్వకుర్తి మున్సిల్ చైర్మెన్ గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన బృంగి రత్నమాల ఆనంద్ కుమార్. వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్ ను సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ సచివాలయం మంత్రి జూపల్లి ఛాంబర్ లో ఆయన ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి పట్టణ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎన్నం భూపతి రెడ్డి, ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చదువుతోనే మంచి భవిష్యత్తు

### మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్

కల్వకుర్తి ఫిబ్రవరి 23 (అక్షర గళం ): విద్యార్థినిలు మంచిగా చదువుకొని ఉద్యోగంలో స్థిరపడినప్పుడే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ అన్నారు. సోమవారం కల్వకుర్తి మున్సిపల్ పరిధిలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల కళాశాలలో మానవతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్ పర్సన్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మానవతా ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ రమ్య సౌజన్య, సీనియర్ జర్నలిస్ట్ దేవికా రెడ్డి,కళాశాల ప్రిన్సిపాల్ యామిని, కౌన్సిలర్ లు చిమ్ముల లలిత, కుడుముల అష్మిత, లెక్చరర్స్ తదితరులు పాల్గొన్నారు.

## పసికందు మృతికి కారణమైన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టు నమోదు చేయాలి

### ::: బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ బృందం

అక్షర గళం, హైదరాబాద్ : పసికందు మరణానికి కారణమైన వారిపై హత్యకేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టు నమోదు చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ బృందం డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర ఘటనలో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని సోమవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కుల దురంకార హత్యలు జరగకుండా బీసీ ఎస్సీ ఎస్టీలపై భౌతిక దాడులు భవిష్యత్తులో జరగకుండా నివారించాలంటే కుమ్మెర నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబమైన గణేష్, చంద్రకళ లకు ప్రభుత్వపరంగా పది లక్షలు రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించాలన్నారు. కుమ్మెర కేసు ఘటనలో సంబంధం ఉన్న అందరనీ ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు తలగకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. అగ్రకుల అహంకారంతో బీసీ దళిత కుటుంబానికి చెందిన వారిపై అమానుషంగా దాడి చేసి పసికందు మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ రజక కుటుంబానికి న్యాయం జరిగే వరకూ రాష్ట్రవ్యాప్తంగా బీసీ జేఏసీ పోరాడుతుందన్నారు. బాధితుల కుటుంబానికి న్యాయం చేస్తామని డిజిపి హామీ ఇచ్చారు..

అక్షరగళం
https://aksharagalam.com
మంగళవారం, 24 | ఫిబ్రవరి 2026
www.aksharagalam.com

# హైదరాబాద్‌లోని చెరువులను కుంటలను అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వం

### కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



అక్షర గళం, కూకట్ పల్లి : హైదరాబాద్ లోని చెరువులను కుంటలను అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వమని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సున్నం చెరువు లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కబ్జాలు చేస్తున్నారని కాలని అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు పిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తో పాటు మాజీ కార్పొరేటర్ సభిహ గౌసుద్దిన్లు సోమవారం సున్నం చెరువును అభివృధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ సున్నం చెరువులో ఉన్న భూమిని హైడ్రాధికారులు కబ్జాదారులకు వదిలేసి ఫెన్సింగ్ వేస్తున్నారన్నారు. ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పెద్దలు అప్పగించే ధోరణిలో హైడ్రాధికారుల పని తీరన్నారు. అల్లాపూర్ సర్వేనెంబర్ 30లో ఉన్న ప్రభుత్వ భూమిని ఇరిగేషన్, జీహెచ్ఎంసీ ప్రభుత్వ అధికారులే 47 లక్షలతో ఫెన్సింగ్ వేశారన్నారు. ప్రభుత్వ అధికారులు వేసిన ఫినిషింగ్ను తీసివేసిడమళ్లీ హైడ్రాధికారులు కాంగ్రెస్ నేతలకు కోట్ల రూపాయల విలువ చేసే భూములను అప్పగించి కొత్త ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు నాయకులు సమయం అడిగితే హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించడం లేదన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి ప్రజలకు తెలియనీయకుండా లైట్లను సైతం వెలగకుంట చేస్తున్నారన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం ఇబ్బందులు గురి చేయడంమేనా రేవంత్ రెడ్డి సర్కార్ పనితనమన్నారు. 2017లో ప్రభుత్వ భూమిని రక్షించాలని అధికారులు పెన్సింగ్ వేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కన్నేసి అధికారులను అడ్డంపెట్టుకొని కబ్జాలు దర్జాగా చేస్తున్నారన్నారు. పేదల ఇండ్లను కూల్చివేయడం పెద్దలకు ఆస్తులు కూడబెట్టడమేనా హైడ్రా అధికారుల పని తీరన్నారు. మూసీ నదిపై గాంధీ విగ్రహాన్ని కట్టడం కోసం 498 ఇండ్లను కూల్చేస్తారా...ప్రభుత్వ భూములు ఉన్న చోట గాంధీ విగ్రహాన్ని నిర్మిస్తే ఏమవుతుందన్నారు. సున్నం చెరువులో కాంగ్రెస్ పార్టీ నేతలు కబ్జాలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని పేదలను రోడ్డుపాలు చేయవద్దన్నారు. ప్రభుత్వ భూములను మూడు లక్షల కోట్ల రూపాయలు కాపాడమని చెప్పుకునే హైడ్రా కమిషనర్ రంగనాథ్ సున్నం చెరువులో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని కూడా చెరువులో కలిపి ఫెన్సింగ్ వేయాలన్నారు. కాంగ్రెస్ నేతలు కబ్జాలు చేస్తే దానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ మద్దతు పలికితే బిఆర్ఎస్ పార్టీ సహించదన్నారు. సున్నం చెరువు అభివృద్ధి విషయంలో స్థానికులను తీసుకొని వెళ్లి హైడ్రా కమిషనర్ ను కలిసినప్పుడు గుట్ట వరకు ఎఫ్ టీ ఎల్ స్థలాలను రక్షిస్తామని మంచి రోడ్డు వేసి గుట్ట ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి తీరా ఆ స్థలాన్ని చెరువు పరిధిలోనుంచి తప్పించి ఫెన్సింగ్ ఎలా వేస్తారుడ ఎందుకు హద్దులు మార్చారన్నారు.

# ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలి

### మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్‌రెడ్డి





అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారుసోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను లా ఆఫీసర్ చంద్రావతి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి అదనపు కలెక్టరు (150) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శిల్పారామంలో అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన









అక్షర గళం, మాదాపూర్ : శిల్పారామం మాదాపూర్ లో ఖాదీ మహోత్సవ 2026 సందర్బంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలలో నళిని గాజుల శిష్య బృందం లలిత సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. శ్రీవల్లి , లలిత సంగీతం ఆలపించారు. మూషిక వాహన, బ్రహ్మాంజలి, విన్యకకౌతం, జావళి, జయము జయము, జనుత శబ్దం, దశావతరాలు, జతిస్వరం, మహేశ్వరి, పదం అంశాలను కళాకారులూ శ్రీనిధి, కీసర, కృతిక, శ్రేష్ఠ, నిహిర , జోషునిఃక, ధాత్రి, లాస్య, శాన్విక, హిమజ, శృతి, ప్రణమ్య, హరిణి , ఆద్య, అద్రితి, అక్షయ, హరిణి, షణ్ముఖ ప్రియా పలువురు ప్రదర్శించి మెప్పించారు.

# తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారు

**మార్చి 16 నుంచి 30 వరకు జరగనున్న సమావేశాలు**

**మార్చి 16న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం**

**మార్చి 20న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీలో నిర్ణయం**

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. సమావేశాల తొలిరోజైన మార్చి 16న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రసంగిస్తారు. అనంతరం మార్చి 17, 18 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుపుతారు. మార్చి 20వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు.



# ఎన్నో ఏలుగా ఎదురుచూస్తున్న చీపునుంతల రైతుల కళ నెరవేరబోతుంది

### ::: బ్రిడ్జి నిర్మాణంతో గ్రామస్తుల హర్షం

కల్వకుర్తి 22. ఫిబ్రవరి(అక్షర గళం) తలకొండపల్లి మండల పరిధిలో చీపునుంతల గ్రామంలోని అమ్రాయ్ చెరువు అలుగు పై బిర్జి మరియు పాత కోట తండా వరకు 3 నిఎ లకు గాను (4.20) కోట్లతో.,బిర్జి రోడ్ దశబ్ద కాల కళ నెరవేరబోతున్నందుకు ఈ విషయం పట్ల సంతోషం వెక్తం చేస్తూ గ్రామ రైతులు హర్షం వెక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యేను గ్రామస్తులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామం రైతులు వర్షం వస్తే అలుగు దాటడానికి రాక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని, మరి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బిర్జి రోడ్ మంజూరు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అతీత్వరలో టెండర్ ప్రాసెస్ కంప్లిట్ చేసి త్వరితగతిన పనులు కంప్లిట్ చేస్తా అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో సీనియర్ కాంగ్రేస్ పార్టీ నాయకులు వెంకట్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మాజీ ఉపసర్పంచ్ మండల, ఎస్సి సెల్ అధ్యక్షులు చెన్నకేశవులు, ఎర్ర శ్రీనాథ్ రెడ్డి, ఎర్ర వేణుగోపాల్ రెడ్డి, ఎర్ర బచ్చి రెడ్డి, ఎర్ర వెంకటేశ్వర రెడ్డి, నాయిని విష్ణువర్ధన్ రెడ్డి,గోసికే జంగయ్య, రామకిష్టయ్య గోసికే కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

# హైదరాబాద్‌లో 'హెల్మెట్ బ్యాంక్'.. పోలీసుల వినూత్న కార్యక్రమం

**హెల్మెట్ లేని వాహనదారుల కోసం 'హెల్మెట్ బ్యాంక్'**

**జరిమానాకు బదులుగా అక్కడికక్కడే హెల్మెట్ అందిస్తున్న పోలీసులు**

**24 గంటల్లో కొత్తది కొని, తీసుకున్న హెల్మెట్‌ను తిరిగివ్వాలి**

**మల్కాజిగిరిలో కార్యక్రమాన్ని ప్రారంభించిన ట్రాఫిక్ పోలీసులు**

**పోలీసుల చొరవపై సోషల్ మీడియాలో ప్రశంసలు**



హెల్మెట్ లేకుండా బైక్‌పై వెళ్తుంటే జరిమానా విధించడం సాధారణం. కానీ, హైదరాబాద్‌లోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోలీసులు దీనికి భిన్నంగా ఓ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాహనదారుల ప్రాణ రక్షణే లక్ష్యంగా 'హెల్మెట్ బ్యాంక్' పేరుతో వినూత్న చొరవ తీసుకున్నారు. దీని కింద హెల్మెట్ లేని వారికి జరిమానా వేయకుండా అక్కడికక్కడే ఒక హెల్మెట్‌ను అందిస్తున్నారు. సోమవారం సంగీత్ చౌరస్తాలో మల్కాజిగిరి ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ విధానంలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని ఆపి, వారి పేరు, ఫోన్ నంబర్, వాహనం వివరాలు నమోదు చేసుకుంటారు. అనంతరం వారికి 'హెల్మెట్ బ్యాంక్' నుంచి ఒక హెల్మెట్ అందించి పంపిస్తారు. అయితే, 24 గంటల్లోగా వారు సొంతంగా కొత్త హెల్మెట్ కొనుగోలు చేసి, పోలీసుల వద్ద తీసుకున్న హెల్మెట్‌ను తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా డీసీపీ రాహుల్ రెడ్డి మాట్లాడుతూ "హెల్మెట్ ధరించడం బరువు కాదు, అదొక బాధ్యత. చిన్న పొరపాటు వల్ల ప్రమాదం జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడుతుంది. అందుకే జరిమానాల కన్నా, వాహనదారుల్లో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం" అని తెలిపారు. మల్కాజిగిరి జోన్‌లోని అన్ని ప్రధాన కూడళ్లలో ఈ హెల్మెట్ బ్యాంకులు అందుబాటులో ఉంటాయని ఆయన వివరించారు. పోలీసుల ఈ కొత్త ప్రయత్నంపై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# ప్రేమ పెళ్లికి పేరెంట్స్ గ్రీన్ సిగ్నల్ తప్పనిసరి!..


### గుజరాత్ సర్కార్ సంచలన ప్రతిపాదన

గుజరాత్‌లో ప్రేమ వివాహం చేసుకోవాలనుకునే జంటలకు రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవాలంటే ఇకపై తప్పనిసరిగా తల్లిదండ్రుల అనుమతి ఉండాలనే నిబంధనను తీసుకురావాలని యోచిస్తోంది. ఈ మేరకు 'వివాహ రిజిస్ట్రేషన్ చట్టం'లో మార్పులు చేయనుంది. ఇది అమల్లోకి వస్తే, తల్లిదండ్రులకు తెలియకుండా పెళ్లి చేసుకోవడం సాధ్యం కాదు. ప్రతిపాదిత సవరణల ప్రకారం పెళ్లి చేసుకునే జంట తమ తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పారో, లేదో దరఖాస్తులో స్పష్టంగా పేర్కొనాలి. దరఖాస్తు అందిన 10 రోజుల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వయంగా వధూవరుల తల్లిదండ్రులకు నోటీసులు పంపుతారు. దరఖాస్తుతో పాటు తల్లిదండ్రుల ఆధార్ వివరాలు కూడా జతచేయాలి. ఈ ప్రక్రియ పూర్తయిన 30 రోజుల తర్వాతే వివాహ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. ఈ నిబంధనల వెనుక ఉన్న ఉద్దేశాన్ని రాష్ట్ర హోం మంత్రి హర్ష్ సంఘ్వీ అసెంబ్లీలో వివరించారు. "ప్రేమ పేరుతో జరిగే మోసాలను అరికట్టడం, అమాయక యువతులు 'లవ్ జిహాద్' బారిన పడకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యం. మోసపూరిత వివాహాలు సామాజిక వ్యవస్థను చెదపురుగుల్లా నాశనం చేస్తున్నాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ప్రభుత్వ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమని, న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో 'హాదియా కేసు'లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వారు గుర్తుచేస్తున్నారు. నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకోవడం అనేది ప్రాథమిక హక్కు అని, ఇందులో తల్లిదండ్రులు గానీ, ప్రభుత్వం గానీ జోక్యం చేసుకోరాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కొత్త రూల్స్ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తాయని సోషల్ మీడియాలోనూ విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ నిబంధనలు కేవలం ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం 30 రోజుల పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలు స్వీకరించనుంది. అనంతరం తుది నిర్ణయం తీసుకుంటుంది. ఒకవేళ ఈ ప్రతిపాదన చట్టరూపం దాల్చితే, దీనిని కోర్టులో సవాలు చేసే అవకాశాలున్నాయి.

# తెరల బందీలో బంధాలు



**ఇటీవలి రోజుల్లో సమాజాన్ని కలచివేసిన కొన్ని ఘటనలు చాలామందిని ఆలోచనలో పడేశాయి. మొబైల్ ఫోన్ తీసేశారని తల్లిపై చేయి చేసుకున్న కొడుకు, క్లాస్‌రూంలో అధ్యాపకురాలిపై దురుసుగా ప్రవర్తించిన విద్యార్థినిఇలాంటి ఉదంతాల వెనక ఉన్న అసలు కారణం ఏమిటన్న ప్రశ్నకు సమాధానం ఒకటే కనిపిస్తోంది. అది ఫోన్‌కు అలవాటు కాదు, ఫోన్‌కే జీవితం అంకితం చేయడం. మన చుట్టూ ఉన్నవారిని పూర్తిగా విస్మరించి, తెరలోని ప్రపంచానికే ప్రాధాన్యం ఇవ్వడమే ఈ ధోరణి. దీనినే ఇప్పుడు 'ఫబ్బింగ్'గా పిలుస్తున్నారు.**



స్నేహితులతో మాట్లాడుతున్నప్పుడు, కుటుంబంతో కలిసి ఉన్నప్పుడు, తరగతిలో లేదా కార్యాలయంలో ఉన్నప్పటికీ ఫోన్ స్క్రీన్ నుంచి చూపు తిప్పలేకపోవడం ఈ అలవాటుకు లక్షణం. సందేశాలు, సోషల్ మీడియా అప్‌డేట్‌లు, వీడియోలుఇవన్నీ ప్రత్యక్ష సంభాషణలకన్నా ముఖ్యంగా మారిపోయాయి. ఈ డిజిటల్ నిర్లక్ష్యం ఎంతలా విస్తరించిందంటే, ఇటీవల నగర విద్యార్థులపై చేసిన ఓ అధ్యయనంలో సగానికి పైగా యువత ఈ అలవాటుకు లోనై ఉన్నట్లు తేలింది. వారిలో చాలామంది మానసిక ఒత్తిడి, అస్థిరత, ఆందోళన వంటి సమస్యలతో బాధపడుతున్నారని వెల్లడైంది. ఈ ఫోన్ బానిసత్వానికి పలు కారణాలు ఉన్నాయి. ఏదైనా సమాచారం మిస్ అవుతామనే భయం ఒకవైపు ఉంటే, మరోవైపు పదేపదే ఫోన్ చూసే అలవాటు మనల్ని నియంత్రిస్తోంది. కొందరు అసౌకర్యంగా అనిపించే సంభాషణల నుంచి తప్పించుకోవడానికి మొబైల్‌ను ఒక రక్షణ కవచంలా వాడుతున్నారు. ఆన్‌లైన్‌లో లభించే తక్షణ ఆనందం, లైక్స్, కామెంట్లు నిజ జీవితంలోని అనుభూతుల్ని మసకబారుస్తున్నాయి. ఈ ధోరణి ప్రభావం ఫోన్ వాడేవారికే కాదు, వారి చుట్టూ ఉన్నవారిపైనా తీవ్రంగా పడుతోంది. తమ మాటలకు విలువ లేదన్న భావన చాలామందిలో ఒంటరితనాన్ని పెంచుతోంది. నిర్లక్ష్యం ఎదుర్కొనే వ్యక్తుల్లో కోపం, నిరాశ, అసంతృప్తి పెరిగి సంబంధాల్లో దూరం ఏర్పడుతోంది. కొన్నిసార్లు ఇవే భావోద్వేగాలు తీవ్రమైన ప్రతిస్పందనలకు, హింసాత్మక చర్యలకు దారి తీస్తున్నాయి. బంధాల్లో నమ్మకం క్రమంగా క్షీణించి, మానసిక ఆరోగ్యం దెబ్బతిం టోంది. ఈ పరిస్థితి నుంచి బయటపడటం అసాధ్యం కాదు. కొంత ఆత్మపరిశీలన, కొద్దిపాటి నియమాలు జీవితాన్ని మళ్లీ సమతు ల్యంలోకి తీసుకురాగలవు. కలిసి ఉన్న సమయాల్లో ఫోన్‌ను దూరంగా ఉంచడం, భోజనం లేదా సంభాషణ సమయంలో తెరల్ని పక్కన పెట్టడం వంటి చిన్న నిర్ణయాలు పెద్ద మార్పుని తీసుకువస్తాయి. అనవసర నోటిఫికేషన్లను తగ్గించడం, రోజులో కొంత సమయానికే ఫోన్ వినియోగాన్ని పరిమితం చేయడం ద్వారా దృష్టి చెల్లాచెదరుకాకుండా ఉంటుంది. ఫోన్ చేతిలోకి వచ్చిన ప్రతిసారి 'ఇది నిజంగా అవసరమా?' అని మనల్ని మనమే ప్రశ్నించుకోవడం అలవాటు చేసుకుంటే డిజిటల్ మోజు తగ్గుతుంది. ఎదుటివారితో మాట్లాడేటప్పుడు వారి మాటలను శ్రద్ధగా వినడం, కళ్లలోకి చూసి స్పందించడం బంధాలకు మళ్లీ ప్రాణం పోస్తుంది. ఫబ్బింగ్ ఒక వ్యక్తిగత అలవాటు మాత్రమే కాదు, సామాజిక సమస్యగా మారుతున్న నేపథ్యంలో కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి దీనిపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. తెరల ప్రపంచాన్ని కాసేపు పక్కన పెట్టి, మనుషుల మధ్య ఉన్న నిజమైన అనుబంధాలకు మళ్లీ విలువ ఇవ్వడమే దీనికి సరైన పరిష్కారం.

# అద్భుతమైన అంజీరా!

**చలికాలం మొదలైతే శరీరంలో ని రోగనిరోధక శక్తి సహజంగానే తగ్గిపోతుంది. ఈ సమయంలో వైరల్ ఇన్ఫెక్షన్లు, జలుబు, దగ్గు, జీర్ణ సమస్యలు చాలామందిని వెంటాడుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆహారంలో చిన్న మార్పు పెద్ద రక్షణగా మారుతుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా అంజీర్ పండ్లు చలికాలంలో శరీరానికి సహజ ఔషధంలా పనిచేస్తాయని నిపుణుల అభిప్రాయం. రోజూ ఒకటి లేదా రెండు అంజీర్ పండ్లు తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన కీలక పోషకాలు అందుతాయి.**

అంజీర్‌ను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో తినడం ఉత్తమ మార్గంగా భావిస్తారు. పండ్లతో పాటు నానబెట్టిన నీటిని కూడా తాగితే అందులో కరిగిన ఖనిజాలు, సూక్ష్మ పోషకాలు పూర్తిస్థాయిలో శరీరంలోకి చేరుతాయి. చలికాలంలో నీటి తీసుకోవడం తగ్గిపోవడంతో చాలామందికి మలబద్ధకం సమస్య తలెత్తుతుంది. అంజీర్‌లో ఉండే అధిక ఫైబర్ జీర్ణవ్య వస్థను చురుకుగా ఉంచి సహజ విరేచనకారిగా పనిచేస్తుంది. దీంతో మల బద్ధకం సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. అంజీర్ పండ్లలో సమృద్ధిగా లభించే క్యాల్షియం చలికాలంలో ఎక్కువగా వేధించే కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది. వయసు పెరిగేకొద్దీ వచ్చే ఎముకల బలహీనత, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యల నుంచి రక్షణనిస్తుంది. అలాగే ఇందులో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచి రక్తంలో చ్కర స్థాయులను నియంత్రించడంలో తోడ్పడుతుంది. టైప్‌ఉ2 డయాబెటిస్‌తో బాధపడేవారికి ఇది సహజ సహాయకుడిగా నిలుస్తుంది. రక్తంలో పెరిగే చెడు కొవ్వు స్థాయులను తగ్గించడంలో కూడా అంజీర్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులోని పొటాషియం రక్తపోటును సమతుల్యంలో ఉంచి గుండెపై ఒత్తిడి తగ్గిస్తుంది. దీని వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం క్రమంగా తగ్గే అవకాశం ఉంటుంది. విటమిన్ సి, విటమిన్ ఇతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంతో జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్లకు శరీరం బలంగా ఎదురు నిలబడుతుంది. అంజీర్‌లో లభించే ఐరన్ రక్తహీనతతో బాధపడేవారికి ఎంతో ఉపయోగకరం. రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయులను పెంచి శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తుంది. అంతేకాదు, చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ అంజీర్ ప్రభావవంతం గా పనిచేస్తుంది. రెగ్యులర్‌గా అంజీర్ తీసుకుంటే చర్మం తేమతో నిండినట్టుగా, సహజ కాంతితో కనిపిస్తుంది. ఈ కారణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుంటే చలికాలంలో అంజీర్‌ను ఆహారంలో భాగంగా మార్చుకోవడం ఆరోగ్యానికి మేలైన అలవాటుగా చెప్పవచ్చు.



# ఆపిల్ టీతో ఆరోగ్యం



ఒక సాధారణ ఆపిల్ పండు నుంచి టీ కప్పు వరకు ప్రయాణం చేస్తే ఆరోగ్య ప్రయోజనాలు మరింత పెరుగుతాయన్న విషయం చాలామందికి తెలియదు. రోజూ తాగే టీకి భిన్నంగా, సహజమైన పోషకాలతో నిండిన ఆపిల్ టీ ఇప్పుడు ఆరోగ్యాన్ని కోరుకునే వారి తొలి ఎంపికగా మారుతోంది. రుచితో పాటు శరీరానికి మేలు చేసే గుణాలే దీనికి ప్రత్యేక ఆకర్షణ.పండ్లలో ఆపిల్‌కు ఉన్న పేరు అంతా ఇంతా కాదు. జీర్ణక్రియను చురుకుగా ఉంచడం నుంచి రోగనిరోధక శక్తిని పెంచడం వరకు ఎన్నో లాభాలు ఇందులో దాగున్నాయి. అదే ఆపిల్‌ను టీ రూపంలో తీసుకుంటే, దాని పోషకాలు మరింత సులభంగా శరీరంలోకి చేరతాయి. ముఖ్యంగా మారుతున్న జీవనశైలిలో తేలికగా జీర్ణమయ్యే పానీయం కావాలనుకునేవారికి ఇది మంచి ప్రత్యామ్నాయం.ఆపిల్ టీకి ప్రధాన బలం ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు. ఇవి శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. వాతావరణ మార్పుల వల్ల తరచూ జలుబు, దగ్గు లాంటి సమస్యలు ఎదుర్కొనే వారికి ఈ టీ మంచి రక్షణ కవచంలా పనిచేస్తుంది. రోజూ ఒక కప్పు తాగడం ద్వారా రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది.జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉన్నవారికి కూడా ఆపిల్ టీ ఉపశమనం ఇస్తుంది. ఆపిల్‌లో సహజంగా ఉండే మాలిక్ యాసిడ్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. పొట్టలో బరువుగా అనిపించడం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలు క్రమంగా తగ్గుతాయి. అంతేకాదు, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలోనూ ఇది సహాయపడుతుంది.బరువు తగ్గాలనుకునే వారికి ఆపిల్ టీ మరింత అనుకూలం. ఇందులో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. చక్కెర కలిపిన టీ లేదా కాఫీకి బదులుగా దీన్ని అలవాటు చేసుకుంటే అనవసరమైన కొవ్వు చేరకుండా ఉంటుంది. ఆకలి ఎక్కువగా వేయకుండా నియంత్రించడంలోనూ ఇది తోడ్పడుతుంది.గుండె ఆరోగ్యానికి కూడా ఆపిల్ టీ ఉపయోగకరం. ఇందులోని ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. రక్తప్రసరణ సక్రమంగా ఉండేలా చేసి, హృదయ సంబంధిత సమస్యల ముప్పును తగ్గిస్తాయి. రోజువారీ ఆహారంలో చిన్న మార్పుగా ఆపిల్ టీని చేర్చుకుంటే దీర్ఘకాలంలో మంచి ఫలితాలు కనిపిస్తాయి.ఇంతటి ప్రయోజనాలున్న ఆపిల్ టీని ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. నీటిలో ఆపిల్ ముక్కలు, టీ ఆకులు, కొద్దిగా నిమ్మరసం, దాల్చిన చెక్క కలిపి మరిగిస్తే సరిపోతుంది. సహజ రుచి, ఆరోగ్య గుణాల కలయికగా తయారయ్యే ఈ టీ రోజును తాజాగా ప్రారంభించడానికి లేదా సాయంత్రం శరీరానికి ఊరట కలిగించడానికి చక్కటి ఎంపికగా నిలుస్తుంది.

**చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల కీళ్లు బిగు సుకుపోయి నొప్పులు రావడం సహజం. ఈ సీజనల్ ఇబ్బందులను తొలగించి, మీ కీళ్లకు మునుపటి బలాన్నిచ్చే 'సూపర్ ఫుడ్స్' ఇవే..**

# కీళ్ల నొప్పులకు ఇలా చెక్



**పసుపు:** ఇందులో ఉండే 'కర్కుమిన్' వాపులను తగ్గి స్తుంది. రాత్రిపూట పసుపు కలిపిన పాలు తాగడం వల్ల కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

**అల్లం:** ఇది సహజ నొప్పి నివారిణిగా పనిచేస్తుంది. అల్లం టీ తాగడం వల్ల, లేదంటే వంటల్లో అల్లం వాడటం ద్వారా కీళ్ల వాపులను తగ్గించుకోవచ్చు.

**ఆవకూర:** విటమిన్‌–, కాల్షియం మెండుగా ఉండే ఈ ఆకుకూర ఎముకల మృదులాస్థిని కాపాడుతుంది.

**నువ్వులు:** కాల్షియం, మెగ్నీషియం పుష్కలంగా ఉండే నువ్వులు ఎముకల సాంద్రతను పెంచి కీళ్లకు బలాన్నిస్తాయి.

**ఉసిరి:** విటమిన్‌–సి పుష్కలంగా ఉండే ఉసిరి కణజా లాల మరమ్మతుకు, కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడు తుంది.

**మెంతులు:** యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలున్న మెంతులు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి.

**నెయ్యి:** పరిమితంగా నెయ్యి తీసుకోవడం వల్ల అది కీళ్లకు లూబ్రికెంట్‌లా పనిచేసి కదలికలను సులభతరం చేస్తుంది.

**రాగులు:** కాల్షియం ఎక్కువగా ఉండే రాగులు ఎము కలను దృఢంగా ఉంచి కీళ్లపై ఒత్తిడిని తగ్గిస్తాయి.

# బట్టతలకు బైబై!



**బట్టతల సమస్యతో బాధపడేవాళ్లు ప్రపంచవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో ఉన్నారు. జుట్టు రాలిపోవడాన్ని ఆపుకోవడానికి, తిరిగి మొలిపించుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. నూనెలు, ఔషధ లేపనాలు, హెయిర్ ట్రీట్‌మెంట్లు అంటూ ఖర్చు చేసినా ఆశించిన ఫలితం దక్కని పరిస్థితి చాలామందిలో కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో బట్టతల బాధితులకు ఊరటనిచ్చే వార్త ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది.**

## జుట్టు కోసం ఎదురుచూపులకు ముగింపు దశ

- **విజయవంతమైన క్లినికల్ పరీక్షలు పూర్తి**
- **ఐరిష్ సంస్థ కీలక ప్రకటన**
- **2027లో మార్కెట్‌లోకి కొత్త ఔషధం**
- **తైలాలు, లేపనాలకు గుడ్‌బై?**
- **బట్టతల బాధితుల్లో కొత్త ఆశలు**
- **శాస్త్రం ఇచ్చిన హెయిర్ రివల్యూషన్**

ఐర్లాండ్‌కు చెందిన ప్రముఖ ఔషధ తయారీ సంస్థ 'కాస్మో ఫార్మాస్యూటికల్స్' బట్టతలపై జుట్టు మొలిపించే ఔషధాన్ని విజయవంతంగా అభివృద్ధి చేసినట్లు ప్రకటించింది. ప్రత్యేకంగా రూపొందించిన 'క్లాస్కోటెరాన్‌ఉ5 శాతం' సొల్యూషన్‌ను 'బ్రీజులా' అనే బ్రాండ్ పేరుతో మార్కెట్‌లోకి తీసుకురావడానికి సంస్థ సిద్ధమవుతోంది. ఈ ఔషధం ప్రస్తుతం ప్రయోగ దశలను విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఇప్పటికే రెండు దశల క్లినికల్ పరీక్షల్లో ఈ సొల్యూషన్ అద్భుత ఫలితాలు చూపినట్లు సంస్థ పేర్కొంది. ఔషధాన్ని ఉపయోగించిన అనేక మందిలో బట్టతలపై కొత్తగా జుట్టు మొలిచినట్లు నిర్ధారణ కావడంతో వైద్య నిపుణుల్లోనూ ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం మూడో దశ క్లినికల్ ట్రయల్స్ కొనసాగుతున్నాయని, అవి కూడా పూర్తయిన అనంతరం నియంత్రణ సంస్థల అనుమతులతో మార్కెట్‌లోకి విడుదల చేస్తామని కంపెనీ తెలిపింది. ఇప్పటివరకు బట్టతల సమస్యకు శాశ్వత పరిష్కారం లేదనే అభిప్రాయం ఉండేది. అందుకే చాలామంది తాత్కాలిక పరిష్కారాలకే పరిమితమయ్యారు. కానీ తాజా ఔషధం జుట్టు మూలాలను మళ్లీ క్రియాశీలంగా మార్చే విధంగా పనిచేస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. ఇది కేవలం జుట్టు రాలడాన్ని ఆపడం మాత్రమే కాదు, కొత్త జుట్టు పెరుగుదలకు కూడా సహకరిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. 2027 నాటికి 'బ్రీజులా' ఔషధాన్ని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. ఒకవేళ మార్కెట్‌లోకి వచ్చిన తర్వాత కూడా ప్రయోగాల స్థాయిలో చూపిన ఫలితాలు కొనసాగితే, హెయిర్ ఆయిల్స్, లేపనాలు, ఖరీదైన చికిత్సలపై ఆధారపడే అవసరం తగ్గే అవకాశం ఉంది. దీంతో బట్టతల బాధితుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. శాస్త్రీయ పరిశోధనల ఫలితంగా రూపుదిద్దుకున్న ఈ ఔషధం, భవిష్యత్తులో జుట్టు సమస్యల చికిత్సలో కీలక మలుపుగా మారుతుందా అనే ఆసక్తి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా నెలకొంది. బట్టతలపై జుట్టు మొలిపించాలనే కోట్ల మంది కలకు ఇది నిజంగా పరిష్కారమవుతుందా అనే ప్రశ్నకు సమాధానం మాత్రం మార్కెట్‌లోకి వచ్చిన తర్వాతే దొరకనుంది.

# కళ్ల కింద వాపులా.. ఇలా చేయండి!



**మనలో చాలా మంది కళ్ల కింద సంచులతో ఇబ్బంది పడుతూ ఉంటారు. కళ్ల కింద చర్మం వాపులకు గురవడం వల్ల ఇలా జరుగుతుంది. వీటిని ఉబ్బిన కళ్లు, కళ్ల కింద వాపు, కళ్ల సంచులు ఇలా వివిధ రకాలుగా పిలుస్తూ ఉంటారు. స్త్రీ, పురుష భేదం లేకుండా అందరినీ ఈ సమస్య వేధిస్తుంది. దీని వల్ల ముఖం అంద విహీనంగా కనిపిస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల, చర్మసంరక్షణను పట్టించుకోకపోవడం వల్ల ఇలా జరుగుతుంది. చాలా మంది ఈ సమస్య నుండి బయటపడడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. కళ్ల కింద సంచులతో బాధపడే వారు ఇప్పుడు చెప్పే 5 విధాలను పాటించడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. కళ్ల కింద చర్మం తిరిగి మామూలు స్థితికి చేరుకుంటుంది, కళ్ల అందం పెరుగుతుంది. కళ్ల కింద వాపులకు గురైన చర్మాన్ని తిరిగి మామూలు స్థితికి తీసుకు వచ్చే 5 విధానాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.**

చాలా మంది వీపు, తలకు మాత్రమే మసాజర్లు ఉంటాయని అనుకుంటూ ఉంటారు. కానీ ఫేషియల్ రోలర్, కూలింగ్ ఐ రోలర్ వంటివి కూడా మనకు మార్కెట్ లో లభిస్తూ ఉంటాయి. వీటితో రాత్రిపూట కళ్ల చుట్టూ మసాజ్ చేయడం వల్ల చర్మానికి ఉపశమనం కలిగి చర్మం తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటుంది. కళ్ల కింద వాపులు తగ్గుతాయి. సోడియంను ఎక్కువగా తీసుకోవడం వల్ల కళ్ల కింద వాపు వస్తుంది. అధికంగా ఉప్పును తీసుకోవడం వల్ల శరీరంలో నీరు నిలిచి ఉంటుంది. దీంతో చర్మం వాపులకు గురైనట్టు ఉంటుంది. కళ్ల కింద కూడా అదే జరిగే అవకాశం ఉంది. కనుక ఉప్పును తీసుకోవడం తగ్గించాలి. రాత్రి పడుకునే సమయంలో ముఖానికి ఎటువంటి మేకప్ లేకుండా చూసుకోవాలి. మేకప్ తొలగించిన తరువాతే నిద్రించాలి. మేకప్ తొలగించకపోవడం వల్ల మస్కారా, లైనర్ వంటి వాటిలో ఉండే అవశేషాలు కంటిలో చిక్కుకుని ఇబ్బంది పెడుతూ ఉంటాయి. దీని వల్ల కళ్ల నుండి నీరు కారడం, కళ్ల కింద ఉబ్బినట్టుగా ఉండడం వంటివి జరుగుతాయి. కనుక రాత్రి నిద్రించే ముందు మేకప్ ను తొలగించడం చాలా అవసరం.క్రీమ్ ను వాడడం..కళ్ల కింద చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. కనుక హాని కలిగించని క్రీములను వాడాలి. కళ్ల కింద వచ్చిన ఉబ్బరాన్ని తగ్గించడానికి, అలసటను తగ్గించడానికి వోట్రే ఐ క్రీమ్ ను వాడాలి. దీనిని ఉపయోగించడం వల్ల కళ్ల కింద ఉబ్బరం తగ్గుతుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల శరీర ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కళ్ల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. కళ్ల కింద వాపు వంటి సమస్యలు కూడా వస్తాయి. కనుక రోజూ 6 నుండి 8 గంటల పాటు అంతరాయం లేని నిద్రపోయేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే టీవీ, సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్ ల వినియోగాన్ని కూడా తగ్గించాలి. ఈ విధంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, చక్కటి పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల కళ్ల కింద చర్మం వాపు తగ్గుతుంది.

# కపాలభాతి ఆసనంతో లాభాలు



**మన దేశంలో యోగాకు చాలా ప్రాధాన్యత ఉంది. యోగా అంటే కేవలం కొన్ని భంగిమలను పునరావృతం చేయడం కాదు. జీవితంలో ఉండే సూక్ష్మశక్తులను గుర్తించడం. ప్రశాంతంగా కూర్చుని నుదుటి మధ్య దృష్టిని కేంద్రీకరించనప్పుడే మనం ఈ సూక్ష్మ శక్తులను గుర్తించగలుగుతాం. శరీరాన్ని, మనస్సును ఏకం చేయడానికి యోగాకు మించిన సాధన లేదు. నిశ్చలతను అభ్యసించినప్పుడే మనం శరీరాన్ని, మనసును ఏకం చేయగలం. నిశ్చలంగా ఉండి, శ్వాస తీసుకుంటూ, అసమతుల్యతను దూరం చేస్తూ చేసే యోగా సాధనాల్లో కపాలభాతి ఆసనం కూడా ఒకటి.**

మన శరీరానికి, మనసుకు గొప్ప అనుభూతిని ఇచ్చే ఆసనాల్లో ఇది ఒకటి. ఈ ఆసనం వేయడం కూడా చాలా సులభం. దీనిని యోగా ఆసనం అనడం కంటే శ్వాస వ్యాయామం అనడం మంచిది. ఈ ఆసనం వేయడం వల్ల ముఖంపై సహజ కాంతి వస్తుందని యోగా నిపుణులు చెబుతున్నారు. ఈ ఆసనం వేయడం వల్ల శారీరక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఎన్నో కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. కపాలభాతి ఆసనం వల్ల మనకు కలిగే ప్రయోజనాల గురించి యోగా నిపుణులు వివరిస్తున్నారు.ూణఎజు=×ూజువీజుచీూ× అఅ ంజూశీతీం జఅఎవశీ 2ూ× అఅ ంజూశీతీం జఅఎవశీ 2గ్యాస్ సమస్యకు చెక్..కపాలభాతి ఆసనం వేయడం వల్ల పొట్ట ఎక్కువగా కదులుతుంది. ఉచ్ఛ్వాస, నిచ్ఛ్వాసల కారణంగా పొట్ట కదలడం ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల కాలేయం, క్లోమం దాని చుట్టూ ఉండే కండరాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆయా అవయవాలకు రక్తప్రసరణ మెరుగుపడుతుంది.కపాలభాతి ఆసనం వల్ల కడుపులో గ్యాస్ సమస్య తగ్గుతుంది. కడుపులో అధిక ఆమ్లత్వం కారణంగా తలెత్తే సమస్యలు కూడా తగ్గుతాయి. జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. పొట్ట చుట్టూ అధిక కొవ్వు సమస్యతో బాధపడే వారు కపాలభాతి ఆసనం వేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఈ ఆసనం వేయడం వల్ల పొట్ట చుట్టూ అధికంగా ఉండే కొవ్వు వేగంగా కరుగుతుంది.ఊపిరితిత్తుల ఆరోగ్యానికి..కపాలభాతి ఆసనం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. ఈ ఆసన సాధన వల్ల గుండె, ఊపిరితిత్తుల్లో ఉండే అడ్డంకులు తొలగించబడతాయి. దీని వల్ల శరీరంలో రక్తప్రసరణ వేగం పెరుగుతుంది. బద్ధకం తగ్గి శరీరంలో ఉత్తేజంగా ఉంటుంది. కపాలభాతి ఆసనం వల్ల ముఖం ప్రకాశవంతంగా తయారవుతుంది. ఈ ఆసనాన్ని తరచూ సాధన చేయడం వల్ల మెదడు కణాలు ఉత్తేజంగా తయారవుతాయి. ఏకాగ్రత పెరుగుతుంది. జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. మతిమరుపు వంటి సమస్యలు తగ్గుతాయి. కపాలభాతి ఆసనం వల్ల ఆధ్యాత్మిక ఫలితాలు కూడా కలుగుతాయి. ఈ ఆసనం శరీరంలోని చక్రాలను సక్రియం చేస్తుంది. ఇది శరీరానికి గొప్ప మేల్కొలుపును ఇస్తుంది.ఇలా మన మొత్తం శరీరానికి కపాలభాతి ఆసనం మేలు చేస్తుందని దీనిని తరచూ సాధన చేయడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని యోగా నిపుణులు చెబుతున్నారు. అయితే నడుము సమస్యలు, అధిక రక్తపోటు వంటి సమస్యలతో బాధపడే వారు నిపుణుల పర్యవేక్షణలో ఈ ఆసనాన్ని సాధన చేయాలి. అలాగే ఈ ఆసనాన్ని ఉదయం పూట చేయవచ్చు లేదా ఉదయం అల్పాహారం తీసుకున్న మూడు గంటల తరువాత కూడా చేయవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

# శాకాహారంతో సహజ సౌందర్యం : జాక్వెలిన్ ఫెర్నాండెజ్



శ్రీలంక నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆమె ఎక్కువగా బాలీవుడ్ సినిమాల్లో నటిస్తూ..అక్కడ వేలాది అభిమానులను సొంతం చేసుకున్నారామె. అంతేగాదు ఫ్యాషన్, ఫిట్‌నెస్ విషయంలో ఐకాన్. ఎప్పటికప్పుడూ సోషల్ మీడియాలో తన ఆహారం, వ్యాయామాల గురించి నెటిజన్లతో షేర్ చేసుకుంటుంటారామె. అలానే ఈ సారి ఆమె తాను శాకాహారిగా మారడంతో తన బాడీలో అద్భుతమైన మార్పులు చోటు చేసుకున్నాయంటూ షేరు చేసుకుంది. ఓ ఇంటర్వ్యూలో కూడా ఈ విషయం గురించి స్వయంగా చెప్పారామె. తాను మొక్కల ఆధారిత భోజనం తీసుకోవడం మొదలుపెట్టిన తర్వాత తన శరీరంలో చాలా మార్పులు సంతరించుకున్నాయని చెప్పుకొచ్చింది. ముఖ్యంగా తన ముఖంలో సహజసిద్ధమైన మెరుపు రావడమే గాక మొటిమలు కూడా మాయమైపోయాయని అన్నారామె. తన చర్మ సంరక్షణ విషయంలో అద్భుతంగా ఈ డైట్ పనిచేసిందన్నారు. తాను మొటిమలతో చాలా ఇబ్బంది పడ్డానని, ఎప్పుడైతే శాకాహారిగా మొక్కల ఆధారితో ఫుడ్‌ని తీసుకోవడం ప్రారంభించానో అప్పటి నుంచి మొటిమలు, మచ్చలు తగ్గి కాంతిమంతంగా ఉందని తెలిపింది. అలాగే బరువు సైతం అదుపులో ఉంది. ఇంతకుమునుపు తగ్గుతూ..పెరుగుతూ ఉండేది. కానీ ఈ శాకాహారం మన బరువుని అద్భుతంగా అదుపులో ఉంచుతుంది. మొత్తం ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని నమ్మకంగా చెప్పుకొచ్చారామె. అందుకు శాస్త్రీయ నిర్ధారణ లేకపోయినా..పొట్ట ఉబ్బరం, బరువు విషయంలో చాలా రిలీఫ్ పొందానంటోంది. శరీరాని అవసరమైన పోషకాలు, ప్రోటీన్లు అందుతాయి. ముఖ్యంగా మంచి ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. మాంస కృత్తులు సైతం మొక్కల ఆధారిత ఆహారం నుంచే పొందవచ్చని అంటుందామె. అందుకోసం కూరగాయలు, బీన్స్, టోఫు వంటి ప్రోటీన్ కంటెంట్ ఎక్కువగా ఉన్నవాటిని తీసుకుంటే చాలని చెబుతోంది. అలాగే నోటి శుభ్రత కోసం ఆయిల్ పుల్లింగ్ చేస్తుంటానని, ఒక లీటరు డిటాక్స్‌నీరు తాగి హైడ్రేషన్‌గా ఉండేలా చూసుకుంటానని చెబుతోంది జాక్వెలిన్.



# మెగా పవర్ స్టార్ సమక్షంలో దర్శకుడు బుచ్చిబాబు బర్త్ డే సెలబ్రేషన్స్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చి బాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-ఇండియా స్పోర్ట్స్-యాక్షన్ డ్రామా 'పెద్ది' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. దర్శకుడు బుచ్చి బాబు సానా పుట్టినరోజు వేడుకని 'పెద్ది' షూటింగ్ లొకేషన్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ , దర్శకుడు బుచ్చి బాబును ప్రత్యేకంగా సన్మానించారు. టీమ్ సభ్యులందరి సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టినరోజును గ్రాండ్ గా సెలబ్రేట్ చేశారు. 'ఉప్పెన'తో బ్లాక్‌బస్టర్ డెబ్యూ అందుకున్న బుచ్చిబాబు సానా, భావోద్వేగంతో కూడిన గ్రామీణ కథనాల ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అదే సిగ్నేచర్ స్టైల్‌ను కొనసాగిస్తూ, 'పెద్ది' ను భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ ఇంటెన్స్, రగ్గడ్ లుక్‌లో పాన్ ఇండియా ఆడియన్స్ ని అలరించబోతున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. శరవేగంగా ముందుకు సాగుతున్న ఈ యాక్షన్ డ్రామా ఈ సమ్మర్‌లో గొప్ప ఎమోషన్స్ తో కూడిన మాస్ ఎంటర్‌టైనర్‌గా ఏప్రిల్ 30న థియేటర్లలోకి రానుంది.





# మాస్ మహారాజా 'ఇరుముడి' ఫస్ట్‌లుక్ రిలీజ్

మాస్ మహారాజా రవితేజ తన ల్యాండ్‌మార్క్ 77వ ప్రాజెక్ట్ 'ఇరుముడి' కోసం సెన్సిబుల్ డైరెక్టర్ శివ నిర్వాణతో చేతులు కలిపారు. ఈ చిత్రాన్ని ప్రముఖ పాన్-ఇండియన్ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ కొలాబరేషన్ ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ అయ్యింది. రవితేజ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన స్పందన లభించింది.మహా శివరాత్రి శుభ సందర్భంగా, మేకర్స్ హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ప్రియా భవానీ శంకర్‌ను కావేరీగా పరిచయం చేశారు. రవితేజ రగ్గడ్ లుక్‌లో ఆమె చెంపపై ప్రేమగా ముద్దుపెడుతూ కనిపించగా, ఇద్దరి మధ్య ఉన్న ఆప్యాయతను పోస్టర్ అందంగా చూపిస్తోంది. మరోవైపు సంప్రదాయ మారూన్ చీరలో ప్రియా భవానీ శంకర్ సహజమైన చిరునవ్వుతో ఆకట్టుకుంటున్నారు. పూలతో అలంకరించిన జుట్టు, మినిమల్ జ్యువెలరీ ఆమె రూరల్ పాత్రకు మరింత అందాన్ని తెచ్చాయి. శివ నిర్వాణ ఇంటెన్స్, ఎమోషన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్ పవర్ ఫుల్ కథని సిద్ధం చేశారు. ముఖ్యంగా తండ్రికూతురు అనుబంధం ఈ చిత్రానికి హైలెట్ గా ఉండబోతుంది. రవితేజ గత సినిమాలకంటే భిన్నంగ కొత్త ఎమోషనల్ షేడ్స్‌తో కూడిన పాత్రలో కనిపించబోతున్నారు.

# సూపర్ స్టార్ లాంచ్ 'నాగబంధం' టీజర్

విరాట్ కర్ణ హీరోగా దర్శకుడు అభిషేక్ నామా రూపొందిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మైథో-యాక్షన్ స్పెక్టకిల్ 'నాగబంధం' టీజర్ పవిత్ర మహా శివరాత్రి సందర్భంగా విడుదలైంది. ఈ చిత్రాన్ని నిర్మాతలు కిషోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు టీజర్‌ను లాంచ్ చేయడంతో దేశవ్యాప్తంగా అంచనాలు మరింత పెరిగాయి. ఆయన తన ఎక్స్ అకౌంట్ లో " #WorldOfNagabandham అద్భుతంగా వుంది. త్వరలో ఎక్స్ పీరియన్స్ చేయాలని ఎదురు చూస్తున్నాను.. అని ట్వీట్ చేశారు. హిమాలయాల మిస్టిక్ నేపథ్యంతో ప్రారంభమయ్యే ఈ టీజర్, కాలానికంటే పురాతనమైన ఒక రహస్య ప్రపంచానికి ప్రేక్షకులను తీసుకెళ్తుంది. ఒక వ్యక్తి లోభం ఆ దైవిక సత్యాన్ని వెలుగులోకి తేవడానికి ప్రయత్నించగా, విధి తన యోధుడిని ఎంచుకునే కథగా ఇది అద్భుతంగా ముందుకు సాగుతుంది. "బ్రహ్మ సృష్టి నుంచి పుట్టిందిడవిష్ణు ధర్మం కాపాడుతోందిడ మహాదేవుడి ఆగ్రహం శక్తినిస్తుందిడ" అనే లైన్ ఈ చిత్ర సోల్ ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. దేవత్వం, విధి, విధ్వంసం కలిసే మహాకావ్యంగా 'నాగబంధం' నిలుస్తుందనే సంకేతాలు టీజర్ ఇస్తోంది.



# "తిమ్మరాజుపల్లి టీవీ" మూవీ సాంగ్ రిలీజ్

న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'టీవీ వీడియో సాంగ్' రిలీజ్ చేశారు. టీవీ, డిష్ వచ్చిన కొత్తలో పల్లెటూరి ప్రజలు ఎంత ఆసక్తిగా ఆ ప్రసారాలు చూశారో ఈ పాటలో చిత్రీకరించారు. టీవీ ఇంటికి వచ్చిన రోజు ఆ ఇంటివారికే కాదు ఆ ఊరిలో టీవీ లేని వారందరికీ పండుగ రోజే. ఊరిలో మొదట టీవీ కొనడం మామూలు గొప్పకాదు, టీవీ ఉన్న ఇంటికి వెళ్లి మిగతా వారంతా సీరియల్స్, సినిమాలు చూసేవారు. ఈ సందడిని పాటలో తెలియజేస్తూ సనరే సాహిత్యాన్ని అందించారు. వంశీకాంత్ రేఖన సంగీతాన్ని అందించగా, స్వరాజ్ కీర్తన్ పాడారు.

# 'నాట్ ఎ డాక్టర్' టైటిల్ పోస్టర్ రిలీజ్



స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై మళ్ళీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి బలమైన, కంటెంట్-బేస్డ్ చిత్రాలకు నిర్మించిన రాహుల్ యాదవ్ నక్కా మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశారు. నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ శ్రీకాంత్ నాగోతి దర్శకత్వం వహిస్తున్నారు. 'నాట్ ఎ డాక్టర్' అనే టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం, టైటిల్ పోస్టర్‌తోనే ఆసక్తిని రేకెత్తిస్తోంది. అడవి నేలలో నుంచి బయటికి వస్తున్న భారీ, మట్టి తడిసిన చేయి పోస్టర్‌లో కనిపిస్తూ, ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని సూచిస్తోంది. Based on a novel that was never written అనే ట్యాగ్‌లైన్ కథలో అద్భుతమైన భావోద్వేగాలు ఉంటాయని సూచిస్తోంది. పాత్‌బ్రేకింగ్ సినిమాలను ప్రోత్సహించే స్వధర్మ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై, శ్రీకాంత్ నాగోతి తన ప్రత్యేకమైన కథన శైలితో ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. సహజమైన నటనతో గుర్తింపు పొందిన నవీన్ చంద్ర ఈ చిత్రంలో ఒక విభిన్నమైన పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారు.




# 'సీతా పయనం'ని ఎంతో నిజాయితీతో తీశాం: కింగ్ అర్జున్ సర్జా

యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా తన స్వీయ నిర్మాణం, దర్శకత్వంలో తీసిన చిత్రం 'సీతా పయనం'. ఈ మూవీతో అర్జున్ కూతురు ఐశ్వర్య అర్జున్, ఉపేంద్ర అన్న కొడుకు నిరంజన్‌ని తెరకు పరిచయం చేశారు. శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ మీద తెరకెక్కించిన ఈ సినిమాని ఫిబ్రవరి 14న రిలీజ్ చేశారు. ఈ సినిమాకి ఆడియెన్స్, మీడియా నుంచి అద్భుతమైన ప్రశంసలు దక్కాయి. యాక్షన్ కింగ్ అర్జున్ మాట్లాడుతూలి .. "సీతా పయనం' కథ గ్రాటిట్యూడ్, థ్యాంకింగ్‌కి సంబంధించింది. మా సినిమాకి ప్రేమను, ప్రశంసల్ని కురిపించిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మాకు ఈ ప్రయాణంలో తోడుగా నిలిచిన మీడియాకి థాంక్స్. పదమూడేళ్ల క్రితం నేను చూసిన యాక్సిడెంట్‌తో ఈ మూవీ లైన్ తట్టింది. ఒక పది సెకన్లు వెనకా ముందు అయినా కూడా ఆ యాక్సిడెంట్ జరిగేది కాదు. అలా అక్కడి నుంచి ఈ ఐడియా పుట్టింది. చూసిన ప్రతీ ఒక్కరూ తమ జీవితాన్ని చూసినట్టుగా ఉందని అంటున్నారు. చెడులోనూ మంచి ఉంటుందని ఇందులోని పాత్రలు రియలైజ్ అవుతుంటాయి. ప్రతీ ఒక్కరి జీవితం ఒక జర్నీలాంటిదే. 'సీతా పయనం' అవుట్ పుట్, రిజల్ట్ పట్ల సంతోషంగా ఉన్నాను. నా కూతురు అద్భుతంగా నటించింది అని ప్రశంసిస్తున్నారు. నేను అక్కడే పాస్ అయ్యాను. నేను గొప్ప సినిమా తీశాను అని కూడా చెప్పడం లేదు. కానీ మేం ఏం అనుకున్నామో అది జనాలకు కనెక్ట్ అయింది. నిరంజన్ ఈ చిత్రంలో అద్భుతంగా నటించారు. ప్రకాష్ రాజ్ గారు, సత్య రాజ్ గారు, కోవై సరళ గారు అద్భుతమైన యాక్టర్స్. బిత్తిరి సత్తి, సిరి, చరణ్ చక్కగా నటించారు అన్నారు. ఐశ్వర్య అర్జున్ మాట్లాడుతూలి .. "సీతా పయనం' మా అందరికీ చాలా ప్రత్యేకం. ఆడియెన్స్ ఇస్తున్న ప్రేమను చూస్తే ఇది మాకు మరింత స్పెషల్‌గా మారింది. ఆడియెన్స్, మీడియా ఇస్తున్న ప్రేమకు థాంక్స్. మా సినిమాని చూడని వారంతా కూడా ఫ్యామిలీతో కలిసి వెళ్లి చూడండి. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. అనూప్ గారి మ్యూజిక్ అద్భుతంగా ఉంటుంది అన్నారు.

PUBLISHED BY **G.KALPANA** AND **PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS**, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254, MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI, TELANGANA, EDITOR : **G.DAYAKAR REDDY**, **RNI :TELTEL/2022/83927**, PHONE NUMBER 9908293393,040- 45046154